కత్తిరించడం వల్ల
పూల మొక్క
మరింత బలంగా
ఎదిగినట్లు
విమర్శల
వల్ల మనలో
నూతన శక్తి
బయటికొస్తుంది.
ప్రతి విమర్శ నుంచీ
ఏదో ఒక విషయం
నేర్చుకోవాల్సిందే.


# DD9 వార్త

తెలుగు దినపత్రిక


## టికెట్ ధర పెంపు లేకుండానే 'ధురంధర్2' పెయిడ్ ప్రీమియర్స్..



08


సంపుటి : 01 సంచిక : 198 | హైదరాబాద్, మార్చి, ఆదివారం 08, 2026 | పేజీలు : 08 వెల : 3.00


# మహిళల భద్రత సమాజ బాధ్యత

**మహిళా దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్‌లో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం**



- పోలీస్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- సోషల్ మీడియాతో వేధింపులు పెరిగాయన్న సీఎం
- పురుషులు మహిళా భద్రతపై బాధ్యత వహించాలని పిలుపు
- కాంగ్రెస్ ప్రభుత్వం అతివలకు అండగా ఉంటుందని హామీ

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

మహిళలపై వేధింపులు పెరుగుతున్నాయనే విషయంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా సోషల్ మీడియా విస్తరణతో మహిళలపై వేధింపులు కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని ఆయన చెప్పారు. మహిళల రక్షణ కోసం చట్టాలు చేయడం మాత్రమే సరిపోదని, వాటిని కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు. మహిళల భద్రత కోసం పురుషులు కూడా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ క్యాంపస్‌లో తెలంగాణ పోలీసు మహిళా భద్రతా విభాగం నిర్వహించిన 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళల భద్రతపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా సమాజం మొత్తం ..మిగతా 2లో



# 130 మంది మావోయిస్టుల లొంగుబాటు

- సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రక్రియ
- భారీగా ఆయుధాల సమర్పణ
- దేశంలోనే అతిపెద్ద లొంగుబాటుగా రికార్డు
- అధిక సంఖ్యలో పీఎల్జీఏ సభ్యులు
- రాష్ట్రంలో హింసకు తావు లేదన్న సీఎం
- శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలి
- అజ్ఞాతంలో ఉన్నవారు బయటకు రావాలి
- మావోయిస్టులకు సీఎం సూచనలు
- ప్రభుత్వ పరంగా పలు హామీలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలో మావోయిస్టుల విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఒకేసారి భారీ సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం రాష్ట్ర రాజకీయాలు, భద్రతా వ్యవస్థల్లో చర్చనీయాంశంగా మారింది. మొత్తం 130 మంది మావోయిస్టులు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. వారు తమ వద్ద ఉన్న ఆయుధాలను కూడా ప్రభుత్వానికి అప్పగించారు.ఈ మావోయిస్టులు నాలుగు బస్సుల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ..మిగతా 2లో

## గద్దర్ సినీ అవార్డులు ప్రకటించిన ప్రభుత్వం

- ఉగాది సందర్భంగా మార్చి 19న అవార్డుల అందజేత
- చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ అవార్డు
- ఉత్తమ చిత్రంగా రాజు వెడ్స్ రాంబాయి
- ఉత్తమ నటుడిగా ఎంపికైన నాగచైతన్య
- ఉత్తమ నటి అవార్డు దక్కించుకున్న రష్మిక

02

## కడియం, దానం భవితవ్యంపై ఉత్కంఠ.!

- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ముగిసిన స్పీకర్ విచారణ
- ఎమ్మెల్యే దానం పిటిషన్‌పై ముగిసిన స్పీకర్ విచారణ
- తీర్పు రిజర్వ్.. త్వరలోనే దానం, కడియం అనర్హత పిటిషన్లపై స్పీకర్ తీర్పు.



03

## ఎలక్ట్రిక్ మొబిలిటీలో భారత్ చైనాతో పోటీ పడగలదు

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు
- ప్రపంచంలో యుద్ధాల తీరు మారుతోందన్న రాహుల్
- సాంకేతికతకు ప్రాధాన్యత పెరుగుతోందని వెల్లడి
- 'ది కేరళ స్టోరీ 2'పై తీవ్ర విమర్శలు
- ఆ సినిమాను ఎవరూ చూడటం లేదని కామెంట్
- కేరళ టెక్నో పార్క్‌లో ఐటీ ఉద్యోగులతో భేటీ



**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

దేశ రాజకీయాల్లో, సాంకేతిక రంగంలో జరుగుతున్న మార్పులపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారి తీశాయి. ఒకవైపు ప్రపంచ యుద్ధాల రూపం మారుతున్న తీరు, ఎలక్ట్రిక్ సాంకేతికత ప్రాధాన్యం గురించి ఆయన మాట్లాడగా.. మరోవైపు 'ది కేరళ స్టోరీ 2' సినిమా గురించి చేసిన విమర్శలు కూడా ..మిగతా 2లో

## చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి

- ఆర్థిక స్వావలంబన సాధనే లక్ష్యంగా ఆడబిడ్డలు కష్టపడాలి
- సవాళ్లు దాటుకుని మరింత ముందుకు సాగాలి
- బీఆర్ఎస్ పాలనలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

చట్ట సభల్లో మహిళా ప్రతినిధులు పెరగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అమ్మాయిలు తమ కాళ్ల మీద తాము నిలబడి, ఆర్థిక స్వాతంత్ర్యం సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆడబిడ్డలకు ..మిగతా 3లో

## మానవతా దృక్పథంతోనే సహాయం

- ఇరాన్ యుద్ధ నౌక ఆశ్రయంపై జైశంకర్
- ఐరిస్ దేనా ధ్వంసంపై తొలిసారి స్పందన
- యుద్ధం కారణంగా జరిగిన ఘటనలపై విచారం
- ఐరిస్ లావన్ మార్చి 4న వచ్చిందని వెల్లడి
- 183 మందికి ఆశ్రయం కల్పించినట్లు వివరణ



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఇటీవల శ్రీలంక తీర ప్రాంతంలో జరిగిన ఒక సముద్ర ఘటన అంతర్జాతీయంగా చర్చకు దారి తీసింది. ఇరాన్‌కు చెందిన యుద్ధ నౌక ఐరిస్ దేనా పై అమెరికా దాడి చేసి దానిని ముంచేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ ఘటనపై భారత కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తొలిసారిగా స్పందించారు. దిల్లీలో జరిగిన ..మిగతా 3లో



03

## లక్ష ఇందిరమ్మ ఇండ్లకు గృహ ప్రవేశాలు

- నెలాఖరులోపు జరుగుతాయి
- డబుల్ బెడ్రూం ఇండ్లకు లబ్ధిదారులను గుర్తించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

## రేవంత్ రెడ్డి కర్ణుడు కాదు కుంభకర్ణుడు, మహాక్రూరుడు

- పేదల గుండెల మీద తన్నే దుర్మార్గుడని ఆగ్రహం
- రేవంత్ రెడ్డి కర్ణుడే అయితే రైతుబంధు ఎందుకు వేయడం లేదని ప్రశ్న
- హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చుతున్నారన్న హరీశ్‌రావు



03

# మహిళల భద్రత సమాజ బాధ్యత




**మొదటిపేజీ తరువాయి**

బాధ్యతగా భావించాలని సీఎం అన్నారు.

**సోషల్ మీడియా వల్ల కొత్త రకాల వేధింపులు**

ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి గతంతో పోలిస్తే ఇప్పుడు పరిస్థితులు చాలా మారిపోయాయని చెప్పారు. ఒకప్పుడు మహిళలపై జరిగే వేధింపులు ఎక్కువగా పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యేవని తెలిపారు. కానీ ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా వేధింపులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.మహిళలు భయపడే పరిస్థితి ఏర్పడితే అది ప్రభుత్వానికి కూడా అవమానమే అని ఆయన అన్నారు. మహిళల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటామని స్పష్టం చేశారు. మహిళలపై జరిగే వేధింపులను అరికట్టడంలో పోలీసులు, చట్టాలు మాత్రమే కాదు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

**మహిళల రక్షణలో పురుషుల పాత్ర**

మహిళల రక్షణలో పురుషుల పాత్ర ఎంతో కీలకమని సీఎం తెలిపారు. మన ఇంట్లో ఉన్న అమ్మాయిలను ఎంత గౌరవిస్తామో సమాజంలోని ప్రతి మహిళను కూడా అలాగే గౌరవించాలని ఆయన సూచించారు. మహిళల భద్రత కోసం ప్రతి యువకుడు ఒక బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం కూడా అదే సందేశాన్ని అందించడానికి నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళల రక్షణలో యువత బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని సీఎం కోరారు.

**రాష్ట్ర అభివృద్ధిలో మహిళల కీలక పాత్ర**

తెలంగాణ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అందుకే తమ ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు.ప్రస్తుతం రాష్ట్రంలో అమలు చేస్తున్న చాలా సంక్షేమ పథకాలు మహిళల పేరుతోనే ఉన్నాయని ఆయన చెప్పారు. కుటుంబంలో మహిళల స్థానం బలపడితే సమాజం కూడా బలపడుతుందని అభిప్రాయపడ్డారు.

**మహిళల ఆర్థిక సాధికారతకు చర్యలు**

మహిళలను ఆర్థికంగా బలంగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు. ఇందుకోసం మహిళలను వ్యాపార రంగంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించడం ద్వారా మహిళలు వ్యాపారాలు ప్రారంభించేలా సహాయం చేస్తున్నామని చెప్పారు.హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ వంటి ఖరీదైన ప్రాంతం పక్కనే మహిళల ఉత్పత్తుల విక్రయం కోసం ఇందిరా మహిళా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీని ద్వారా మహిళలు తయారు చేసే వస్తువులకు మంచి మార్కెట్ లభిస్తుందని చెప్పారు.

**మహిళల ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్**

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు తయారు చేసే వస్తువులకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రముఖ ఈకామర్స్ సంస్థ అమెజాన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు.దీంతో గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులు దేశ విదేశాల్లో విక్రయించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. మహిళల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని వివరించారు.

**ఆర్టీసీలో మహిళలకు అవకాశాలు**

మహిళల సాధికారత కోసం ప్రభుత్వం చేపట్టిన మరో ముఖ్య కార్యక్రమాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీలో వెయ్యి బస్సులను నడిపిస్తున్నామని తెలిపారు. ఈ బస్సులకు మహిళలే యజమానులుగా ఉన్నారని చెప్పారు.దీంతో మహిళలు కేవలం ఉద్యోగులుగానే కాకుండా



వ్యాపార భాగస్వాములుగా మారుతున్నారని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఇది మంచి అవకాశమని చెప్పారు.అదే సమయంలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని గుర్తు చేశారు. ఈ పథకం వల్ల మహిళలకు ప్రయాణంలో పెద్ద ఉపశమనం లభించిందని తెలిపారు.

**కోటి మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే లక్ష్యం**

రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్థితి మెరుగుపడాలని ప్రభుత్వం కోరుకుంటోందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. మహిళలు కేవలం కుటుంబ బాధ్యతలకే పరిమితం కాకుండా వ్యాపారం, పరిశ్రమ, విద్య, రాజకీయాలు వంటి అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆయన అన్నారు.

**మహిళలకు మరిన్ని అవకాశాలు**

మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని సీఎం చెప్పారు. పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయడంలో కూడా మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.సోలార్ విద్యుత్ ఉత్పత్తి రంగంలో కూడా మహిళలు ముందుకు రావడానికి ప్రోత్సాహం ఇస్తున్నామని చెప్పారు. మహిళలు పెద్ద పారిశ్రామికవేత్తలతో పోటీ పడే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం కోరుకుంటోందని పేర్కొన్నారు.

**మహిళా శక్తికి గౌరవం**

మహిళా శక్తికి గౌరవం ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ సంప్రదాయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశంలో రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, లోక్‌సభ స్పీకర్, ముఖ్యమంత్రులుగా మహిళలకు అవకాశం కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని చెప్పారు.తెలంగాణలో కూడా మహిళలకు తగిన గౌరవం ఇవ్వడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం కూడా మహిళా శక్తికి గౌరవం తెలిపే భాగమని చెప్పారు.

**మహిళలు ప్రశ్నించే స్వభావం పెంచుకోవాలి**

మహిళలు వంటింటికే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని రంగాల్లో ముందుకు రావాలని సీఎం సూచించారు. తమ హక్కుల కోసం మహిళలు ప్రశ్నించే స్వభావం పెంచుకోవాలని చెప్పారు.మహిళలు ధైర్యంగా ముందుకు వస్తే సమాజంలో మంచి మార్పులు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళల భద్రత, అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

**మహిళల భద్రతే రాష్ట్ర గౌరవం**

మహిళలు భద్రంగా ఉండే రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళలు ఎక్కడైనా భయపడకుండా జీవించే పరిస్థితి ఉండాలని ఆయన అన్నారు.'స్టాండ్ విత్ హర్' వంటి కార్యక్రమాల ద్వారా మహిళల భద్రతపై అవగాహన పెంచాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. మహిళల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని సీఎం మరోసారి గుర్తు చేశారు.మొత్తంగా మహిళల భద్రత, సాధికారత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, సమాజం కూడా దీనిలో భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# 130 మంది మావోయిస్టుల లొంగుబాటు

**మొదటిపేజీ తరువాయి**

పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో ఆయుధాలను సమర్పించి లొంగిపోయారు. వారు మొత్తం 124 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. అందులో 31 ఏకే47 తుపాకులు కూడా ఉన్నాయి. ఒకేసారి ఇంత భారీ సంఖ్యలో మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోవడం తెలంగాణలో ఇదే తొలిసారి అని అధికారులు చెబుతున్నారు.లొంగిపోయిన వారిలో మావోయిస్టు పార్టీకి చెందిన వివిధ స్థాయిల నాయకులు మరియు కేడర్ సభ్యులు ఉన్నారు. ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, పది మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు ఈ లొంగుబాటులో భాగమయ్యారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు దేవ్‌జీకి చెందిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్జీఏ) దళానికి చెందిన సభ్యులే ఎక్కువగా లొంగిపోయినట్లు సమాచారం.

ఇక వీరు అప్పగించిన ఆయుధాల్లో కూడా భారీ సంఖ్యలో తుపాకులు ఉన్నాయి. ఒక లైట్ మెషీన్ గన్, 31 ఏకే47 రైఫిళ్లు, 21 ఇన్సాస్ రైఫిళ్లు, 20 ఎస్ఎల్ఆర్ తుపాకులు, 18 0.303 రైఫిళ్లు మరియు మరో 33 ఇతర రకాల తుపాకులు ఉన్నాయి. ఈ ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.లొంగిపోయిన వారిలో ఆంధ్రఒడిశా సరిహద్దు ప్రాంతంలో పనిచేసిన ప్రముఖ మావోయిస్టు నేత చలసాని నవత కూడా ఉన్నారు. ఆమె ప్రస్తుతం ఏఓబీ స్టేట్ కమిటీ సభ్యురాలిగా ఉన్నారు. చలసాని ప్రసాద్ కుమార్తె అయిన నవత చాలా కాలంగా మావోయిస్టు కార్యకలాపాల్లో పాల్గొంటూ వచ్చారు.

ఈ లొంగుబాటు కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో హింసకు తావు లేదని ఆయన స్పష్టం చేశారు. ఆయుధాలతో పోరాడటం ద్వారా సమస్యలకు పరిష్కారం దొరకదని అన్నారు. ప్రపంచంలో కూడా చాలా సమస్యలు చర్చల ద్వారానే పరిష్కారమవుతున్నాయని గుర్తుచేశారు.మహాత్మా గాంధీ చూపించిన అహింసా మార్గాన్ని ఆయన ఉదాహరణగా చెప్పారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా భారతదేశం శాంతియుతంగా పోరాడి స్వాతంత్ర్యం సాధించిందని అన్నారు. అందువల్ల హింసా మార్గం కాకుండా ప్రజాస్వామ్య మార్గాల్లో సమస్యలను పరిష్కరించుకోవాలని మావోయిస్టులకు సూచించారు.

ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు కూడా బయటకు వచ్చి జనజీవన స్రవంతిలో కలవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉంటుందని తెలిపారు.మావోయిస్టు నాయకులతో తాను గతంలో చర్చలు జరిపినట్టు కూడా సీఎం చెప్పారు. దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి మరియు ఇతర నాయకులతో సుదీర్ఘంగా మాట్లాడినట్టు వివరించారు. వారు తమ సమస్యలను వివరించగా ప్రభుత్వం వాటిని పరిశీలించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు.

మావోయిస్టులు లొంగిపోవడానికి అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేసినట్టు సీఎం తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో కూడా ఈ విషయంపై చర్చలు జరిపినట్టు చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు మంచి జీవితం అందించేలా చూడాలని ఆయన సూచించారని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం పునరావాస సదుపాయాలు కల్పిస్తుందని సీఎం హామీ ఇచ్చారు. వారికి ఆర్థిక సహాయం, నివాస



సౌకర్యం, ఆరోగ్య భద్రత అందిస్తామని చెప్పారు. స్వగ్రామాల్లో ఇల్లు కట్టుకోవడానికి కూడా ప్రభుత్వం సహాయం చేస్తుందని తెలిపారు.

అదే విధంగా లొంగిపోయిన వారికి ఆరోగ్య భద్రత కార్డులు కూడా ఇస్తామని సీఎం పేర్కొన్నారు. నగదు బహుమతుల అంశంపై కూడా త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పునరావాస పథకాల ద్వారా వారు సాధారణ జీవితంలోకి తిరిగి రావడానికి సహాయం చేస్తామని తెలిపారు.ఇప్పటి వరకు తెలంగాణలో మొత్తం 721 మంది మావోయిస్టులు లొంగిపోయారని సీఎం వెల్లడించారు. వారు సుమారు 250 ఆయుధాలను పోలీసులకు అప్పగించినట్టు చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల మావోయిస్టుల్లో కూడా ఒక నమ్మకం పెరిగిందని అన్నారు.

ఈ లొంగుబాటు కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, అదనపు డీజీ విజయ్ కుమార్, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ ఐజీ సుమతి తదితరులు పాల్గొన్నారు. మావోయిస్టులను లొంగిపోవడానికి ప్రోత్సహించడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషించిందని సీఎం ప్రశంసించారు.ఇటీవల మావోయిస్టు పార్టీకి చెందిన కొన్ని అగ్రనేతలు కూడా లొంగిపోయారు. దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డి వంటి నాయకులు గత నెలలోనే లొంగిపోయారు. ఇప్పుడు వారి ఆధ్వర్యంలో పనిచేసిన కేడర్ కూడా లొంగిపోవడం ఈ పరిణామానికి మరింత ప్రాధాన్యత తీసుకొచ్చింది.

ముఖ్యంగా దేవ్‌జీకి భద్రతగా ఉన్న సభ్యులు మరియు పీఎల్జీఏ దళానికి చెందిన కేడర్ ఈ లొంగుబాటులో ఎక్కువగా ఉన్నారు. వారు గతంలో అడవుల్లో కార్యకలాపాలు నిర్వహించినవారని పోలీసులు చెబుతున్నారు.మొత్తంగా ఒకేసారి 130 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోవడం తెలంగాణలో పెద్ద సంఘటనగా భావిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన చర్చలు, పునరావాస హామీలు మరియు పోలీసుల కృషి వల్లే ఈ పరిణామం సాధ్యమైందని అధికారులు పేర్కొంటున్నారు.ఇంకా అడవుల్లో ఉన్న మావోయిస్టులు కూడా త్వరగా లొంగిపోవాలని సీఎం రేవంత్ రెడ్డి మరోసారి పిలుపునిచ్చారు. శాంతియుత మార్గాల్లోనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆయన స్పష్టం చేశారు.

# గద్దర్ సినీ అవార్డులు ప్రకటించిన ప్రభుత్వం

- **చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ అవార్డు**
- **ఉత్తమ చిత్రంగా రాజు వెడ్స్ రాంబాయి**
- **ఉత్తమ నటుడిగా ఎంపికైన నాగచైతన్య**
- **ఉత్తమ నటి అవాడ్డు దక్కించుకున్న రష్మిక**
- **ఉగాది సందర్భంగా మార్చి 19న అవార్డుల అందజేత**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ సినీ అవార్డులు సినీ పరిశ్రమలో కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. గతంలో నిలిచిపోయిన ప్రభుత్వ సినీ పురస్కారాల సంప్రదాయాన్ని తిరిగి ప్రారంభిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు రెండోసారి ఈ అవార్డులను ప్రకటించడంతో సినీ వర్గాలు, అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఈసారి అవార్డుల్లో ప్రముఖ నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు చోటు దక్కించుకున్నారు. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవికి ప్రతిష్ఠాత్మకమైన ఎన్టీఆర్ జాతీయ అవార్డు ప్రకటించడం విశేషంగా మారింది. సినీ రంగానికి ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రకటించారు.

తెలంగాణ ప్రభుత్వం గతంలో ఉన్న నంది అవార్డుల స్థానంలో గద్దర్ సినీ అవార్డులను ప్రవేశపెట్టింది. దాదాపు పదేళ్ల పాటు ప్రభుత్వ సినీ పురస్కారాలు నిలిచిపోయాయి. అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఈ సంప్రదాయాన్ని కొనసాగించింది. తెలంగాణ ప్రజా కవి గద్దర్ పేరుతో ఈ అవార్డులను ప్రారంభించడం ప్రత్యేకతగా నిలిచింది. సినీ కళాకారుల ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహం ఇవ్వడం ఈ అవార్డుల ముఖ్య ఉద్దేశ్యంగా ప్రభుత్వం చెబుతోంది.

**ఉగాది రోజున ఘనంగా అవార్డు వేడుక**

ఈ ఏడాది గద్దర్ సినీ అవార్డులను ఉగాది పండుగ సందర్భంగా మార్చి 19న ఘనంగా నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో జరిగే ఈ కార్యక్రమంలో సినీ తారలు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉంది.గత సంవత్సరం ప్రారంభమైన ఈ అవార్డుల కార్యక్రమాన్ని ఈసారి మరింత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. సినీ ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంపై ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**ప్రత్యేక పురస్కారాలు**

ఈ ఏడాది గద్దర్ అవార్డుల్లో భాగంగా పలువురు సినీ దిగ్గజాలకు ప్రత్యేక పురస్కారాలు ప్రకటించారు. అందులో భాగంగా మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ అవార్డు ప్రకటించారు. రఘుపతి వెంకయ్య అవార్డును ప్రముఖ నిర్మాత రమేశ్ ప్రసాద్‌కు ఇవ్వనున్నారు. పైడి జయరాజ్ అవార్డుకు నటుడు కమల్ హాసన్ ఎంపికయ్యారు.నాగిరెడ్డి-చక్రపాణి అవార్డును ప్రముఖ నిర్మాత అశ్వనీదత్‌కు ప్రకటించారు. ఏఎన్ఆర్ అవార్డును సీనియర్ నటి జయసుధ అందుకోనున్నారు.టీఎల్ కాంతారావు అవార్డుకు దర్శకుడు ఆర్.నారాయణమూర్తి ఎంపికయ్యారు. ప్రముఖ గేయరచయిత సుద్దాల అశోక్ తేజకు సి.నారాయణరెడ్డి అవార్డు ప్రకటించారు. అలాగే ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుకు బీఎన్ రెడ్డి అవార్డు ఇవ్వనున్నారు.

**ఫీచర్ ఫిల్మ్ అవార్డులు**

ఈ ఏడాది ఉత్తమ చిత్రంగా 'రాజు వెడ్స్ రాంబాయి' ఎంపికైంది. ద్వితీయ ఉత్తమ చిత్రంగా 'దండోరా', తృతీయ ఉత్తమ చిత్రంగా 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' ఎంపికయ్యాయి.

ఉత్తమ నటుడిగా నాగచైతన్యకు అవార్డు లభించింది. ఆయన నటించిన 'తండేల్' చిత్రానికి ఈ పురస్కారం వరించింది. ఉత్తమ నటిగా హీరోయిన్ రష్మికకు అవార్డు లభించింది. ఆమె నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రానికి ఈ గుర్తింపు దక్కింది.

ఉత్తమ దర్శకుడిగా సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి) ఎంపికయ్యారు. జాతీయ సమైక్యతను ప్రతిబింబించే ఉత్తమ చిత్రంగా తండేల్ ఎంపికైంది.

ఉత్తమ సందేశాత్మక చిత్రంగా కోర్ట్, ప్రజాదరణ పొందిన చిత్రంగా సంక్రాంతికి వస్తున్నాం ఎంపికయ్యాయి.

**ఇతర విభాగాల్లో విజేతలు**

ఈ ఏడాది ఉత్తమ నూతన దర్శకుడిగా సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్) ఎంపికయ్యారు. ఉత్తమ బాలల చిత్రంగా అనగనగా అవార్డు దక్కింది.

ఉత్తమ సహాయ నటుడిగా శివాజీ (దండోరా), ఉత్తమ సహాయ నటిగా భూమిక (యుఫోరియా) అవార్డులు పొందారు.

సంగీత దర్శకుడిగా మార్క్ రాబిన్ (దండోరా) ఎంపికయ్యారు. ఉత్తమ గాయకుడిగా అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి) అవార్డు అందుకోనున్నారు. ఉత్తమ గాయని అవార్డు సాహితీ చాగంటి (కన్నప్ప)కు దక్కింది.

ఉత్తమ బాలనటుడిగా మాస్టర్ రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో) ఎంపికయ్యారు.

కథా రచయితగా గుణశేఖర్ (యుఫోరియా), స్క్రీన్ ప్లే విభాగంలో అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం) అవార్డులు పొందారు.




గేయ రచయితగా నందకిశోర్ (కుబేర) ఎంపికయ్యారు. సినిమాటోగ్రాఫర్‌గా కార్తీక్ ఘట్టమనేని (మిరాయ్) అవార్డు దక్కింది.

ఎడిటర్‌గా శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్), ఆడియోగ్రాఫర్‌గా ఎం.ఆర్. రాధాకృష్ణన్ (కిష్కింధపురి) ఎంపికయ్యారు.

కొరియోగ్రాఫర్‌గా సందీప్ (ఛాంపియన్), ఆర్ట్ డైరెక్టర్‌గా తోటతరణి (ఛాంపియన్) అవార్డులు పొందారు.

మేకప్ ఆర్టిస్ట్‌గా గోవిందరాజు (అఖండ-2), కాస్ట్యూమ్ డిజైనర్‌గా చంద్రకాంత్ (ఛాంపియన్) ఎంపికయ్యారు. యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా పీటర్ హెయిన్స్ (ఛాంపియన్) అవార్డు పొందారు.

**స్పెషల్ జ్యూరీ అవార్డులు**

స్పెషల్ జ్యూరీ అవార్డులు కూడా పలువురికి ప్రకటించారు. శ్రీరాజ్ రాచకొండ (23 ఫిల్మ్), చైతు జొన్నలగడ్డ (రాజు వెడ్స్ రాంబాయి), రోషన్ మేక (ఛాంపియన్), అనంతిక (8 వసంతాలు) ఈ విభాగంలో అవార్డులు అందుకోనున్నారు.

# ఎలక్ట్రిక్ మొబిలిటీలో భారత్ చైనాతో పోటీ పడగలదు

**మొదటిపేజీ తరువాయి**

రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

**ఎలక్ట్రిక్ మొబిలిటీపై రాహుల్ అభిప్రాయం**

కేరళలోని తిరువనంతపురంలో ఉన్న టెక్నో పార్క్‌లో ఐటీ ఉద్యోగులతో జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రపంచంలో యుద్ధాల తీరు ఇప్పుడు పూర్తిగా మారుతోందని ఆయన పేర్కొన్నారు.ఒకప్పుడు భారీ ఆయుధాలు, ట్యాంకులు ప్రధాన పాత్ర పోషించేవి.కానీ ఇప్పుడు డ్రోన్లు, బ్యాటరీలపై ఆధారపడే సాంకేతిక పరికరాలు ఎక్కువగా ఉపయోగిస్తున్నారని చెప్పారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఉదాహరణగా ప్రస్తావించిన ఆయన, అక్కడ యుద్ధభూమిలో డ్రోన్లు పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారని తెలిపారు. అవి గాల్లో వలయాకారంలో తిరుగుతూ లక్ష్యాలను దాడి చేస్తున్నాయని చెప్పారు. ఈ విధమైన యుద్ధ పరికరాలు ప్రధానంగా బ్యాటరీ ఆప్టిక్స్, ఎలక్ట్రిక్ మోటార్ల వంటి సాంకేతికతలపై ఆధారపడుతున్నాయని వివరించారు.

ఇలాంటి కీలక సాంకేతిక రంగాల్లో ప్రస్తుతం చైనా ఆధిపత్యం ఎక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే సరైన విధానాలు, దీర్ఘకాలిక విజన్‌తో భారత్ కూడా ఈ రంగాల్లో చైనాతో పోటీ పడగలదని రాహుల్ గాంధీ అన్నారు. ఎలక్ట్రిక్ మొబిలిటీ, బ్యాటరీ టెక్నాలజీ, ఎలక్ట్రిక్ మోటార్ల తయారీలో భారత్ ముందుకు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు.ప్రపంచ రాజకీయ పరిస్థితులు కూడా వేగంగా మారుతున్నాయని ఆయన తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అలాగే ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను ఆయన ప్రస్తావించారు. ఈ పరిస్థితుల్లో సాంకేతికతకు మరింత ప్రాధాన్యం పెరుగుతోందని అన్నారు.

**'ది కేరళ స్టోరీ 2'పై రాహుల్ విమర్శలు**

ఇదిలా ఉండగా ఇటీవల విడుదలైన 'ది కేరళ స్టోరీ 2' సినిమా దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు కారణమైంది. ఈ సినిమా గురించి కూడా రాహుల్ గాంధీ తన అభిప్రాయాన్ని వెల్లడించారు.సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఆయన చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారితీశాయి. కేరళ సంస్కృతి, అక్కడి సంప్రదాయాల గురించి దేశ ప్రజలకు బాగా తెలుసని రాహుల్ అన్నారు. అందుకే 'ది కేరళ స్టోరీ 2' వంటి సినిమాలను ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానించారు.

కొన్ని సినిమాలను సమాజంలో విభేదాలు సృష్టించడానికి ఉపయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒక వర్గాన్ని కించపరచడం, ప్రజల



మధ్య చీలికలు తీసుకురావడం కోసం సినిమాలను ఆయుధంలా వాడుతున్నారని విమర్శించారు. అలాంటి ప్రయత్నాల వల్ల కొంతమంది రాజకీయ లాభం పొందినా, చివరికి నష్టపోయేది సాధారణ ప్రజలేనని అన్నారు.భావప్రకటన స్వేచ్ఛ గురించి కూడా రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికైనా తమ అభిప్రాయాన్ని చెప్పాలనిపిస్తే వారిపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. అయితే కొన్ని వర్గాలకు అనుకూలమైన కథనాలను మాత్రం ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రచారం చేయడానికి అవకాశాలు కల్పిస్తున్నారని ఆయన ఆరోపించారు.

# కడియం, దానం భవితవ్యంపై ఉత్కంఠ.!

- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ముగిసిన స్పీకర్ విచారణ
- ఎమ్మెల్యే దానం పిటిషన్‌పై ముగిసిన స్పీకర్ విచారణ
- తీర్పు రిజర్వ్. త్వరలోనే దానం, కడియం అనర్హత పిటిషన్లపై స్పీకర్ తీర్పు.



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారం ఇప్పుడు ఒక నిర్ణయాత్మక దశకు చేరుకుంది. బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ గూటికి చేరిన పది మంది ఎమ్మెల్యేల అనర్హత వేటుపై దాఖలైన పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం తుది విచారణను పూర్తి చేశారు. సుప్రీంకోర్టు విధించిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో, స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారింది. విచారణ అనంతరం స్పీకర్ వెలువరించిన ప్రాథమిక నిర్ణయాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. మొత్తం పది మంది ఎమ్మెల్యేలలో ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్ చీట్ ఇచ్చారు. వారిపై దాఖలైన అనర్హత పిటిషన్లలో సరైన ఆధారాలు లేవనో లేదా సాంకేతిక కారణాల వల్లనో ఆ పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు.

దీనితో ఆ ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు పెద్ద ఊరట లభించినట్లయింది. అయితే, అందరి దృష్టి ఇప్పుడు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్లపైనే ఉంది. వీరిద్దరి కేసుల్లో మాత్రం స్పీకర్ తన తీర్పును వెల్లడించకుండా రిజర్వ్ చేశారు. వీరి విషయంలో ఫిర్యాదులు , ఆధారాలు బలంగా ఉన్నాయా లేక మరేదైనా కారణమా అన్నది తెలియాల్సి ఉంది. వీరిద్దరి భవితవ్యంపై స్పీకర్ ఏ క్షణమైనా తుది తీర్పు వెలువరించే అవకాశం ఉండటంతో, వారి ఎమ్మెల్యే పదవులు ఉంటాయా లేదా అనే ఉత్కంఠ తెలంగాణ రాజకీయాల్లో పరాకాష్టకు చేరుకుంది.

# కర్ణుడు కాదు కుంభకర్ణుడు, మహాక్రూరుడు

**మొదటిపేజీ తరువాయి**

పేదల గుండెల మీద తన్నే దుర్మార్గుడని ఆగ్రహం
రేవంత్ రెడ్డి కర్ణుడే అయితే రైతుబంధు ఎందుకు వేయడం లేదని ప్రశ్న

**హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చుతున్నారన్న హరీశ్ రావు**

తాను కర్ణుడిలాంటి వాడినన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. చొప్పదండి నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కర్ణుడు కాదని, కుంభకర్ణుడని ఎద్దేవా చేశారు. తనను తాను కర్ణుడితో పోల్చుకుంటున్న ముఖ్యమంత్రి మహాక్రూరుడు అని మండిపడ్డారు.

కర్ణుడు మాటతప్పని వాడని, తన కవచ కుండలాలను కూడా దానం చేసిన త్యాగధనుడని అన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల గుండెల మీద తన్నే దుర్మార్గుడని అన్నారు. రేవంత్ రెడ్డి కర్ణుడిలాంటి వాడే అయితే రైతు బంధు ఏది, ఇళ్లు కూలగొట్టి విధ్వంసం సృష్టించడం ఎందుకని నిలదీశారు. కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా మారిస్తే రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టారని మండిపడ్డారు. 24 గంటల విద్యుత్, ఆరు గ్యారెంటీ హామీల అమలు ఎక్కడ అని ప్రశ్నించారు.

కేసీఆర్ అభివృద్ధికి కేరాఫ్ అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసానికి కేరాఫ్ అని విమర్శించారు. రేవంత్ రెడ్డికి విమర్శలు చేయడంపై ఉన్న దృష్టి రైతుల కష్టాల మీద లేదని అన్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో అభివృద్ధి అంటే ఏమిటో చూపించామని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేసిందేమీ లేదని విమర్శించారు. హైడ్రా పేరుతో, మూసీ సుందరీకరణ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం పేదల ఇళ్లను కూల్చుతున్నారని ఆరోపించారు.

రేవంత్ రెడ్డిని కుంభకర్ణుడితో పోల్చవచ్చని హరీశ్ రావు అన్నారు. ఎందుకంటే ఎన్నికలు రాగానే ఆయన నిద్రలేస్తారని, ఎన్నికలయ్యాక కేసీఆర్, బీఆర్ఎస్ మీద నిందలు వేయడమే రేవంత్ రెడ్డికి తెలుసని అన్నారు. కరోనా సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు వేసిందని గుర్తు చేశారు.



# మానవతా దృక్పథంతోనే సహాయం

**మొదటిపేజీ తరువాయి**

రైసినా డైలాగ్ కార్యక్రమంలో ఆయన ఈ విషయంపై వివరాలు వెల్లడించారు.

జైశంకర్ మాట్లాడుతూ ఇటీవల విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ నౌకాదళ కార్యక్రమాల సందర్భంగా కొన్ని ఇరాన్ యుద్ధ నౌకలు భారత్‌కు వచ్చాయని తెలిపారు. అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూమరియు మిలాన్ 2026 కార్యక్రమాలకు పలు దేశాల నౌకాదళాలు పాల్గొన్నాయని చెప్పారు. ఆ కార్యక్రమాలకు వచ్చిన ఇరాన్ నౌకలు యుద్ధానికి సంబంధం లేకుండా స్నేహపూర్వక కార్యక్రమాల కోసం మాత్రమే వచ్చాయని ఆయన వివరించారు.అయితే ఆ సమయంలో ప్రపంచంలో కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం వల్ల ఆ నౌకలు అనుకోని సమస్యలను ఎదుర్కొన్నాయని తెలిపారు. ముఖ్యంగా పశ్చిమాసియా ప్రాంతంలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో సముద్ర మార్గాల్లో కూడా ప్రభావం పడిందని చెప్పారు.

ఇరాన్‌కు చెందిన ఐరిస్ దేనా అనే యుద్ధ నౌక హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న సమయంలో దాడికి గురైనట్లు సమాచారం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఆ నౌకపై జరిగిన దాడి తర్వాత సముద్రంలో పెద్ద ప్రమాద పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి మొదట శ్రీలంక నౌకాదళానికి ప్రమాద హెచ్చరిక చేరిందని జైశంకర్ తెలిపారు. అనంతరం భారత నౌకాదళం కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నట్లు చెప్పారు. శ్రీలంక సముద్ర జలాల్లో జరిగిన ఈ ఘటనలో సుమారు 150 మంది సిబ్బంది గల్లంతైనట్లు సమాచారం ఉందని ఆయన చెప్పారు.

ప్రమాదం జరిగిన వెంటనే భారత నౌకాదళం స్పందించిందని జైశంకర్ వెల్లడించారు. ముందుగా ఒక లాంగ్ రేంజ్ మెరైన్ పెట్రోలింగ్ విమానాన్ని అక్కడికి పంపినట్లు తెలిపారు. పరిస్థితిని అంచనా వేయడానికి ఆ విమానం సముద్ర ప్రాంతాన్ని పరిశీలించినట్లు చెప్పారు.అదే సమయంలో అవసరమైన సహాయక సామగ్రితో మరో విమానాన్ని కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎయిర్ డ్రాపబుల్ లైఫ్ రాఫ్ట్‌లు మరియు ఇతర రక్షణ పరికరాలను అందించడానికి రెండో విమానం పంపినట్లు ఆయన చెప్పారు.ఆ ప్రాంతానికి ఐఎన్ఎస్ తరంగిణి అనే భారత నౌక కూడా చేరుకున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన



రోజు సాయంత్రం ఆ నౌక అక్కడికి చేరి సహాయక చర్యల్లో పాల్గొన్నట్లు చెప్పారు. అనంతరం కొచ్చి నుంచి ఐఎన్ఎస్ ఇక్షక్ అనే మరో నౌకను కూడా అక్కడికి పంపినట్లు వెల్లడించారు.ఇదే సమయంలో ఇరాన్‌కు చెందిన మరో యుద్ధ నౌక ఐరిస్ లావన్ గురించి కూడా జైశంకర్ వివరించారు. ఆ నౌక తిరిగి తమ దేశానికి వెళ్తున్న సమయంలో సాంకేతిక సమస్య ఎదురైందని చెప్పారు. ఆ సమస్య కారణంగా నౌక ప్రయాణం కొనసాగించడం కష్టంగా మారిందని తెలిపారు.

ఈ పరిస్థితుల్లో ఆ నౌకను అత్యవసరంగా నిలిపేందుకు ఇరాన్ ప్రభుత్వం భారత్‌ను సంప్రదించిందని చెప్పారు. కొచ్చి నౌకాశ్రయంలో తాత్కాలికంగా ఆ నౌకను నిలిపేందుకు అనుమతి ఇవ్వాలని ఇరాన్ విజ్ఞప్తి చేసిందని వివరించారు.ఆ సమయంలో కొన్ని చట్టపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ మానవతా దృక్పథంతో భారత్ ఆ విజ్ఞప్తిని పరిశీలించిందని జైశంకర్ తెలిపారు. చివరకు ఈ నెల 1వ తేదీన ఆ నౌకకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. దీంతో ఈ నెల 4వ తేదీన ఐరిస్ లావన్ నౌక కొచ్చి తీరానికి చేరుకుని అక్కడ నిలిచిందని ఆయన చెప్పారు. ఆ నౌకలో ఉన్న మొత్తం 183 మంది సిబ్బందికి భారత్ ఆశ్రయం కల్పించినట్లు తెలిపారు.ఈ విషయంలో భారత్ సరైన నిర్ణయం తీసుకుందని జైశంకర్ పేర్కొన్నారు. సముద్రంలో ప్రమాద పరిస్థితులు ఎదురైనప్పుడు మానవతా దృక్పథంతో సహాయం చేయడం ప్రతి దేశం బాధ్యత అని ఆయన అన్నారు.

ఈ ఘటనపై ప్రస్తుతం సోషల్ మీడియాలో కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. హిందూ మహాసముద్రం ప్రపంచంలో ప్రత్యేకమైన పర్యావరణ వ్యవస్థ కలిగిన ప్రాంతమని జైశంకర్ చెప్పారు. ప్రపంచంలోని ఇతర సముద్ర ప్రాంతాలతో పోలిస్తే హిందూ మహాసముద్రం ప్రత్యేకమైన జీవవైవిధ్యం కలిగి ఉందని తెలిపారు. ఈ ప్రాంతం భారత్‌కు వాణిజ్య పరంగా కూడా చాలా ముఖ్యమైనదని చెప్పారు.



# చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి

**మొదటిపేజీ తరువాయి**

ఆర్థిక స్వతంత్రమే అసలైన గౌరవం ఇస్తుందని అన్నారు. ఆర్థికంగా ఎవరి మీదా ఆధారపడకుండా, సొంతంగా ఉద్యోగం లేదా వ్యాపారం చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలిచే స్థాయికి ఎదిగినప్పుడే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని తెలిపారు. ఆర్థిక స్వావలంబన ఉంటేనే మహిళలకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో మహిళా రిజర్వేషన్లు అమలులోకి రానున్న నేపథ్యంలో, చదువుకున్న విద్యావంతులు, సామాజిక స్థితిగతులపై అవగాహన ఉన్న మహిళలు రాజకీయాల్లోకి రావాలని కేటీఆర్ కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించామని, భవిష్యత్తులోనూ మహిళా సంక్షేమం కోసం మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. కేసీఆర్ కిట్, కల్యాణ లక్ష్మి, షీ టీమ్స్, భరోసా వంటి పథకాలు మహిళలకు అండగా నిలిచాయని గుర్తు చేశారు. మరోసారి రాష్ట్రంలోని మహిళల ఆశీస్సులతో కేసీఆర్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని, ఆడబిడ్డల కోసం మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్‌లో బొబ్బా నవతా రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మహిళా పురస్కారాల ప్రదానోత్సవానికి హాజరై కేటీఆర్ మాట్లాడారు. నేటి సమాజంలో పురుషాధిక్యత అడుగడుగునా ఉన్నదని, రాజకీయాలు కూడా దానికి అతీతం కాదని అభిప్రాయపడ్డారు. "ఒక రంగంలో పురుషుడు విజయం సాధించడానికి 100 శాతం కష్టపడితే, అదే రంగంలో మహిళ రాణించాలంటే 200 శాతం శ్రమించాల్సిన పరిస్థితి ఉంది. పోటీ ప్రపంచంలో మహిళలు నిలదొక్కుకోవాలంటే రెట్టింపు ప్రయత్నం చేయక తప్పదు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మహిళలు పాల్గొన్నారు.

# లక్ష ఇందిరమ్మ ఇండ్లకు గృహ ప్రవేశాలు

- నెలాఖరులోపు జరుగుతాయి
- డబుల్ బెడ్రూం ఇండ్లకు లబ్ధిదారులను గుర్తించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు 3.60 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా ఇందులో లక్ష ఇండ్లకు ఈనెల 31వ తేదీలోగా గృహ ప్రవేశాలు జరగనున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. త్వరలోనే గృహ ప్రవేశాలకు అనుకూలమైన తేదీలను అధికారికంగా తెలియజేస్తామని వెల్లడించారు. ఇండ్లు మంజూరు చేసిన తర్వాత కూడా కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ పూరి గుడిసెలు కనిపిస్తున్నాయని, అలాంటి కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఇండ్ల నిర్మాణంలో చేర్చాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్ సెక్రటేరియట్‌లోని తన కార్యాలయం నుంచి శనివారం ప్రజాపాలన ప్రగతి నివేదిక 99 రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం నిర్మాణం పూర్తికి దగ్గరగా ఉన్న ఇండ్లను సమర్థంగా సమన్వయం చేసుకుని జూన్ చివరి నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్‌లో రెండో దశ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేనాటికి మొదటి దశ ఇండ్లు కొలిక్కి రావాలని సూచించారు.

ఇండ్ల నిర్మాణంలో ఉపయోగించే నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం వల్ల లబ్ధిదారులపై అదనపు భారం పడకుండా జిల్లా స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలు చురుకుగా పని చేయాలని మంత్రి సూచించారు. అవసరమైతే కలెక్టర్లతో కలిసి సమీక్షించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకల సరఫరా పెంచేందుకు స్థానికంగా ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాల ద్వారా బ్రిక్ యూనిట్లను ప్రోత్సహించాలని చెప్పారు. అవసరమైతే ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా సరఫరా పెరిగి ధరల నియంత్రణలో ఉండే అవకాశమున్నదని అన్నారు. రాష్ట్రంలో కొన్ని చోట్ల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి ఒకటి లేదా రెండు విడుతల చెల్లింపులు చేసిన తర్వాత వివిధ కారణాలతో నిలిపివేయడం సరికాదని తెలిపారు. ఇటువంటి చెల్లింపులను తక్షణమే క్లియర్ చేయాలని, లేదంటే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ స్థాయిలో నిర్మాణంలో ఉన్నా డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను మార్చి 31లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ కార్యదర్శి వీపీ గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఉపాధిని దెబ్బతీసే పథకాలను అడ్డుకోవాలి

**బోధన్, నిజామాబాద్ 06మార్చి(డీడీ9 వార్త) :**

మహిళల ఉపాధిని దెబ్బతీసే వి.బి.జి. రామ్‌జీ పథకాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.గోదావరి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా పోరాట దినోత్సవం సందర్భంగా శుక్రవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మార్చి 8న మనం జరుపుకునే అంతర్జాతీయ మహిళా పోరాట దినం కేవలం వేడుక మాత్రమే కాదని, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మరింత దృఢంగా పోరాడాల్సిన సమయమని పేర్కొన్నారు. మహిళల హక్కుల కోసం, ఉపాధి అవకాశాల పరిరక్షణ కోసం మహిళాలోకం ఐక్యంగా ముందుకు సాగాలని ఆమె దిశానిర్దేశం చేశారు.



సదస్సుకు బోధన్ పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సంధ్యారాణి, జిల్లా నాయకులు బిపాషా బేగం, సి.పి.ఐ.(ఎం.ఎల్) మాస్ లైన్ బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి. మల్లేష్ లు మాట్లాడుతూ.. మహిళలు తమ హక్కుల పట్ల చైతన్యవంతులు కావాలని, అన్యాయాలను ఎదిరించే శక్తిని పెంపొందించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెహానా, అమూల్య, లక్ష్మి, గంగామణి, అనసూయ, పోశవ్వతో పాటు పలువురు మహిళా ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బజార్ హత్నూర్, మార్చి 7(డిడి9న్యూస్ ):-**



బజార్హత్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం రోజు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి బోథ్ నియోజకవర్గం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పగలు 12 గంటలకు హాజరయ్యారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 61 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు.ఈ సందర్భంగాఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రములోని ప్రతీ గ్రామం గడపలో కేసీఆర్ ప్రారంభించిన ఏదో ఒక పథకం ఉందని అన్నారు. అందరికి ఏదో ఒక సహాయం అడగకపోయిన, హామీ ఇవ్వకపోయిన కేసీఆర్ తెలంగాణ ప్రజల పట్ల ఆలోచించి పథకాలను ప్రారంభించారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్తో పాటుగా, బజార్ హత్నూర్ తహసీల్దార్ శ్యామ్ సుందర్,బోథ్ ఆత్మ అధ్యక్షులు గొర్ల రాజు యాదవ్,ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయం అధ్యక్షులు మల్లెపూల నర్సయ్య, బజార్హత్నూర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు పర్చ సాయన్న, కాంగ్రెస్ మండలం కన్వీనర్ జల్కె పాండురంగ్, బిఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్, తరుణ్, చైతన్య, ఆయా గ్రామాల పంచాయతీల సర్పంచులు కార్యకర్తలు,వివిధ పార్టీ ల నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బరంగ్ ఏడ్గిలో కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ

**బీర్కూర్, మార్చి 07(డిడి9 వార్త):**

మండలంలోని బరంగ్ ఏడ్గి గ్రామంలో గ్రామానికి చెందిన చాకలి సునీత అనే లబ్ధిదారురాలికి ఐదవ వార్డు సభ్యురాలు పుల్కంటి గంగవ్వ శనివారం కల్యాణలక్ష్మి చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఉన్నంత కాలం అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకం ఉండదని తెలిపారు. ఆయన సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గోండ్ల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ గోండ్ల రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాదేపురం గంగన్న, కుమ్మరి గంగారాం, మేత్రి నాగుగొండ, హట్కారి దశరథ్, క్యాదని లింగప్ప, బోయి లాలయ్య, మొండ్కారి వీరప్ప, సందుల రవి, శావులం శంకర్, హొక్నారి అశోక్, క్యాదని లక్షప్ప, గైని చిన్న సాయిలు, బసప్ప తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన సర్పంచ్ ల శిక్షణ కార్యక్రమం...

**కోటగిరి /పోతంగల్ మార్చి 7 (డిడి9 వార్త)**

నిజామాబాద్ జిల్లాకొత్తగా ఎన్నికైన బోధన్ డివిజన్ స్థాయి గ్రామ సర్పంచ్లకు ఐదు రోజుల ట్రైనింగ్ ప్రోగ్రామ్ నేటితో ముగిసింది. ఈనెల రెండు నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమం శనివారం ముగిసింది. జిల్లా కేంద్రంలో న్యాక్ లో డిపిఓ డిఎల్పిఓ ఆధ్వర్యంలో శిక్షణ ఏర్పాటు చేశారు. జిల్లా అధికారులు సర్పంచులకు దిశా నిర్దేశాన్ని సూచించారు. ప్రతి ఒక్క గ్రామ సర్పంచ్ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వం నుండి వచ్చే నిధులను దుర్వినియోగపరచకుండా, గ్రామపంచాయతీ సభ్యులతో గ్రామ పెద్దలతో చర్చించి పలు నిర్ణయాలు తీసుకోవాలని వారు సూచించారు. ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతి గ్రామంలో మంచినీటి ఎద్దడి తీర్చాలని సూచించారు. జిల్లా అధికారులు సర్పంచ్లకు గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందు ఉంచడానికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, బోధన్ డివిజన్ స్థాయి గ్రామ సర్పంచ్లు పాల్గొన్నారు.



# శ్రీ వేద హై స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ ప్రారంభం







**నిజామాబాద్, కోటగిరి మార్చి 07 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ వేద హై స్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోటగిరి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యతతో కూడిన చదువులు అత్యంత అవసరమని అన్నారు. కేవలం పాఠ్యపుస్తకాల చదువులు కాకుండా సృజనాత్మక ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు చేయగలిగే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. భట్టి విధానంలో చదువుకునే విద్య కంటే ఇన్నోవేషన్ ఆధారిత అధ్యయనం ద్వారా విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు సుమారు 150కు పైగా ప్రదర్శనలను తయారు చేసి ప్రదర్శించారు. మిషన్ భగీరథ, రాకెట్ లాంచింగ్ విధానం, సోలార్ వ్యవస్థ, నెలలు మరియు వాటి స్వభావం, వ్యవసాయ పంటల ఉత్పత్తి విధానం, మానవ జీర్ణ వ్యవస్థ, కిడ్నీ పనితీరు వంటి అనేక అంశాలపై రూపొందించిన మోడళ్లను ప్రదర్శించారు. వాటిని పరిశీలించిన సుధాకర్ విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకుని అభినందించారు.భావితరాలకు సైన్స్‌పై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాఠశాల తరఫున సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ తెల్ల రవికుమార్, ప్రిన్సిపాల్ తెల్ల అక్ష, ఉపాధ్యాయులు నఫీజ్, సాయి పవన్, నాగరాజు, భరత్, రేష్మ, చంద్రకళ, సురేఖ, గంగాసాగరి, సునీత తదితరులు పాల్గొన్నారు.

# గుడిహత్నూర్ మండలంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్



- **బీజేపీలోకి 200 మందికి పైగా నాయకులు, యువకుల చేరిక**

**డిడి9 వార్త గుడిహత్నూర్:**

మండలంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ ఎదురు దెబ్బ తగిలింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో బీజేపీ పార్టీలో చేరారు. మండల కేంద్రంలోని శివకళ్యాణ మండపంలో శనివారం జరిగిన చేరికల కార్యక్రమంలో గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు కేంద్రే శివాజీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ సర్పంచ్ సునీత రమేష్ జాదవ్, మాజీ ఉపసర్పంచ్ సిద్ధార్థ, మాధవ్ పటేల్, పర్లాద్, సంజు తదితర నాయకులు, యువకులు కలిసి 200 మందికి పైగా బీజేపీ పార్టీలో చేరారు. వారికి అదిలాబాద్ జిల్లా పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ పార్టీ కండువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బీజేపీ పార్టీని మరింత బలోపేతం చేయాలని, రాబోయే జెడ్పిటిసి మరియు ఎంపిటిసి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు గణేష్ పటేల్, డాక్టర్ లక్ష్మణ్, మాజీ జెడ్పిటిసి రాజు, శైలేందర్, మహేష్ జునుగురు , సీనియర్ నాయకులు వామన్ పటేల్, ఆడే సునీల్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోటగిరి జడ్పిహెచ్ఎస్ హైస్కూల్లో ఫేర్‌వెల్ డే ఘనంగా నిర్వహణ

**నిజామాబాద్, కోటగిరి, మార్చి 07 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ హైస్కూల్‌లో శనివారం స్కూల్ డే కార్యక్రమం మరియు పదవ తరగతి విద్యార్థుల కోసం ఫేర్‌వెల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు గారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన సేవా కార్యకర్త తోట శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు రాబోయే పబ్లిక్ పరీక్షల దృష్ట్యా అవసరమైన పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పాఠశాలకి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బర్ల సాయిలు సర్, హర్షద్ హుస్సేన్ సర్ మరియు ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. అలాగే విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్.



**ఆదిలాబాద్ బోథ్, మార్చి 07(డి డి 9 వార్త )**

సోనాల మండలంలోని సాకేరా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం శనివారం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ గారు కూడా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని నాయకులను కోరగా, ఎల్లప్పుడూ సహకరిస్తామని వారు హామీ ఇచ్చారు ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు




# ఇచ్చోడలో బెల్ట్ షాపులన్నింటిని ఎత్తివేయాలి

- **విచ్చల విడిగా అమ్ముతున్నరు**
- **ఇచ్చోడ ఎక్సైజ్ సిఐ కి వినతి పత్రం**

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో ( డిడి 9 వార్త న్యూస్ )**

ఏజెన్సీ మండల కేంద్రమైన ఇచ్చోడలో బెల్ట్ షాపులన్నింటినీ తక్షణమే మూసివేయాలని లేనట్లయితే పెద్ద ఎత్తున ఆందోళన చేపడు తామని తుడుం దెబ్బ బోథ్ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం మ హేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇచ్చోడా ఎక్సైజ్ సీఐకి ఒక వినతి పత్రం సమర్పించారు ఏజెన్సీ మండల కేంద్రమైన ఇచ్చోడలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఎక్కడపడితే అక్కడ దాదాపు 60 బెల్ట్ షాపులు తెరిచారని తక్షణమే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బెల్ట్ షాపుల పట్ల పోలీసులు ఎక్సైజ్ అధికారు లు పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని, ఆదివాసి గిరిజను లు పొట్టకూటి కోసం బెల్ట్ షా పులు పెట్టుకుంటే వాటిని మూసివేస్తున్నారని, ఆదివాసి గిరిజన యువకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, గిరిజనేతరు లు బెల్ట్ షాపులు తెరుస్తే అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆయన ఆరోపిం చారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసి గిరిజనుల హక్కుల ను చట్టాలను అధికారులే హ రించి వేస్తున్నారని ఆరోపించా రు. ఇచ్చోడ మండల కేంద్రం లో బెల్ట్ షాపులను ఎత్తివేయ నట్లయితే ఇంతటి ఆందోళన కైనా సిద్ధంగా ఉన్నామని, వా రం రోజుల్లోగా వాటిని ఎత్తి వే యాలని లేదంటే ఇచ్చోడ మండల కేంద్రంలోనీ అమరణ నిరాహార దీ క్ష చేపడతామని డిమాండ్ చేశారు.



# దుబార్ పేట్ ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీగోడనిర్మాణానికిభూమిపూజ.



**బోథ్, మార్చి, 7(డిడి9న్యూస్ ):-**

ఇచ్చోడ మండలంలోనిదుబార్ పేట్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్, స్థానిక సర్పంచ్ కాత్లె ప్రమీల విఠల్తో కలిసిశనివారం రోజు భూమిపూజచేశారు.రూపాయలు 10 లక్షల వ్యయంతో పనులు చేపట్టనున్నారు.ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సత్యవతి కోటేశ్వర్, దుబార్ పేట్ సర్పంచ్ కాత్లె ప్రమీల విఠల్,గ్రామ పటేల్ సలాం నాగోరావు,ఉప సర్పంచ్ సిడం ఆనంద్ రావు, గేర్జం సర్పంచ్ ప్రకాశ్,అడిగామ సర్పంచ్ అనసూయపోతారెడ్డి, ధర్మపురి సర్పంచ్ విశ్వనాథ్ ,ఇచ్చోడ మండల అధ్యక్షుడు కళ్ళెం నారాయణరెడ్డి,నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు ముస్తఫా,ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు కొత్తూరి లక్ష్మణ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, మాజీ పాక్స్ ఉపాధ్యక్షులుబద్దం పురుషోత్తం రెడ్డి, యండిసద్దాం,నడికుంట ఆశన్న,మాజీ సర్పంచ్ షబ్బీర్, హుస్సేన్ గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.







# జెడ్పిహెచ్ఎస్ పోతంగల్‌లో పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం

**పోతంగల్, మార్చి 07(డిడి9 వార్త):**

పోతంగల్ మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పోతంగల్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు తొమ్మిదవ తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు డాన్సులు, స్కిట్‌లు ప్రదర్శించి కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులకు భవిష్యత్తులో చదువుల్లో రాణించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. సాయిల్ సార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అనురాధ, ఉపాధ్యాయులు లత, నాగనాథ్, రామారావు, హనుమాన్లు, షబానా మేడం, వనజ, రాఘవమ్మ, చందర్, మాధవి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# తోషం తండాలో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌కు శ్రీకారం

**డిడి9 వార్త గుడిహత్నూర్, శనివారం:**

గుడిహత్నూర్ మండలం తోషం తండా గ్రామ పంచాయతీలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక - 99 రోజుల యాక్షన్ ప్లాన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ), గ్రామ లైబ్రరీ మరియు బస్టాండ్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామస్థులు, సిబ్బంది కలిసి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ జాదవ్ జితేందర్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధి కోసం చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు నీటి పైప్‌లైన్ ఏర్పాట్లు



**పోతంగల్, మార్చి 07(డిడి9 వార్త):**

ప్రస్తుతం ఎండాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పోతంగల్ మండల కేంద్రంలోని పోతంగల్ గ్రామంలో శనివారం స్థానిక సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్ ఆధ్వర్యంలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాట్లు చేపట్టారు. గ్రామంలోని చెక్‌పోస్ట్ వద్ద ఉన్న వాటర్ స్కీమ్ నుండి గ్రామంలోని వివిధ కాలనీలకు గ్రామపంచాయతీ తరపున కొత్త పైప్‌లైన్లు వేసి తాగునీటి సరఫరా సక్రమంగా అందేలా చర్యలు తీసుకున్నారు. ఎండాకాలంలో నీటి కొరత లేకుండా ముందుగానే ఈ పనులు చేయడం గ్రామ ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు.ఈ అభివృద్ధి పనులను గ్రామస్తులు అభినందిస్తూ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్, ఉపసర్పంచ్ నబి మరియు గ్రామపంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నబి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి.రైతన్న పోరుబాటలో : ఎంపీ గోడం నగేష్

**బజార్హత్నూర్, మార్చి 7(డిడి9న్యూస్ ):-**

రైతులను మోసం చేసి గద్దె నెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రజలు వెంటనే గద్దె దించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు.శనివారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమాపథకాన్ని అమలు చేయాలని, రైతుబంధు నిధుల్ని వెంటనే విడుదల చేయాలనే ప్రధాన డిమాండ్తో రైతన్న పోరుబాట కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి భారతీయ జనతా పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాయల్ శంకర్ నాయకత్వంలో శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, బిజెపిఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యేలు పాయల శంకర్,ధన్పాల్,సూర్యనారాయణ, రామారావు పటేల్, బీజేపీ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానందం,రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బసవ లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.







# సాలూర సరిహద్దులో ఇసుక చెక్ పోస్ట్ ప్రారంభం

**బోధన్, నిజామాబాద్ జిల్లా07మార్చి(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సాలూర సరిహద్దు వద్ద తెలంగాణ రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భవేష్ మిశ్రా, నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఈ అంతర్రాష్ట్ర చెక్ పోస్టును శనివారం ప్రారంభించారు. ఈ చెక్ పోస్టు వద్ద వేయింగ్ మెషిన్ ఏర్పాటు చేయడం వల్ల ఇకపై అక్రమ రవాణాతో పాటు వాహనాల ఓవర్ లోడింగ్‌ను కూడా సమర్థవంతంగా అరికట్టవచ్చని ఎం.డి భవేష్ మిశ్రా తెలిపారు. మహారాష్ట్ర నుండి ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్న ఇసుకను నిబంధనలకు అనుగుణంగా తరలించేందుకు అవకాశం ఉన్నప్పటికీ, సాలూర వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ చెక్ పోస్ట్ ఏర్పాటుతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటమే కాకుండా, ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు ఓవర్ లోడ్ వల్ల పాడయ్యే రోడ్లు, ప్రమాదాల నుంచి ఉపశమనం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్‌కు సమీపంలో మహారాష్ట్ర క్వారీలు ఉండటంతో ప్రజలకు తక్కువ ధరకే ఇసుక లభిస్తుందని ఆయన వెల్లడించారు. సరిహద్దు సమస్యలు తలెత్తకుండా మంజీరా పరివాహక ప్రాంతాల్లో సాంకేతికతను వినియోగిస్తూ తెలంగాణ భూభాగాన్ని స్పష్టంగా గుర్తించామని ఆయన వివరించారు. ఇసుక రవాణాలో పారదర్శకత కోసం రాష్ట్రవ్యాప్తంగా నాలుగు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని పటిష్టంగా కొనసాగిస్తామని, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఎం.డి హెచ్చరించారు.





# ఆత్మరక్షణే మహిళా సాధికారతకు తొలిమెట్టు



- **విద్యార్థులకు న్యాయ నిపుణుల దిశానిర్దేశం**

**నిజామాబాద్ జిల్లా 07మార్చి(డీడీ9 వార్త) :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో వసుధ హైస్కూల్, ఐఐటి ఒలంపియాడ్ డిజిటల్ సెమీ రెసిడెన్షియల్ క్యాంపస్‌లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీ రాజ్ కుమార్ సుబేదారి మాట్లాడుతూ.. పిల్లల భద్రతకు సంబంధించి పోక్సో చట్టంపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి అపరిచితులు లేదా ఇతరుల ప్రవర్తనలో మార్పులను గమనిస్తే వెంటనే పెద్దలకు తెలియజేయాలని సూచించారు. మహిళలు కేవలం చదువుకే పరిమితం కాకుండా అన్ని రంగాలలోనూ రాణించాలని, సమాజంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆత్మరక్షణ విద్యలైన కరాటే, టైక్వాండో వంటి శిక్షణలను నేర్చుకోవడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ కౌన్సిలర్లు అంజలి, సుమలత, పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ నితీష్‌మాలోతి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సూపరింటెండెంట్ శైలజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# బోధన్ పట్టణంలో దోమల నివారణకు ముమ్మర చర్యలు

**బోధన్, నిజామాబాద్ 07మార్చి(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలో పెరుగుతున్న దోమల ఉధృతిని అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు 29వ వార్డు కౌన్సిలర్ రాజులదేవి లక్ష్మీపూజిత పవన్ కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని తన వార్డు పరిధిలో దోమల నివారణ కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వార్డులోని మురికి కాలువలలో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. దోమల సంతతిని అరికట్టడం లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఉన్న నీటిని తొలగించాలని కోరారు. పారిశుధ్య లోపం వల్లే దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయని కావున చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే వ్యాధుల బారి నుండి రక్షణ పొందవచ్చని సూచించారు. ప్రజలందరూ ఆరోగ్య స్పృహతో ఉంటూ అధికారులకు, పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# నిజామాబాద్ పరిధిలో రెండు వారాల్లో 246 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

- **రూ.20.30 లక్షల జరిమానా**

**నిజామాబాద్ జిల్లా 07మార్చి(డీడీ9 వార్త) :**

పోలీస్ కమిషనరేట్ పరిధిలో రహదారి భద్రతను పటిష్టం చేసేందుకు పోలీసులు చేపట్టిన ప్రత్యేక వాహన తనిఖీల్లో భాగంగా గత రెండు వారాల్లో భారీగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 7 వరకు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లు మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 246 మందిని గుర్తించి కేసులు నమోదు చేశామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. పట్టుబడిన 246 మంది వాహనదారులను సంబంధిత కోర్టుల్లో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి మొత్తం రూ. 20 లక్షల 30 వేల జరిమానా విధించింది. నిబంధనలను ఉల్లంఘించిన 16 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలందరూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలను



గుర్తించి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. వాహనదారులు తమ వెంట తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలను ఉంచుకోవాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని కమిషనర్ స్పష్టం చేశారు.

# పెండింగ్ ఓపెన్ ఎంక్వైరీ కేసుల పరిష్కారమే లక్ష్యం : సీపీ పి.సాయి చైతన్య



**నిజామాబాద్ జిల్లా 07మార్చి(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్న మౌఖిక విచారణ కేసులను వేగవంతంగా పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు నడుంబిగించారు. ఇందులో భాగంగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శనివారం ప్రత్యేకంగా ఓపెన్ ఎంక్వైరీ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న 17 మౌఖిక విచారణ కేసులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా పారదర్శకంగా విచారించాలని దర్యాప్తు అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరగాలంటే దర్యాప్తు ప్రక్రియలో జాప్యం ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక మేళా నిర్వహణతో మంచి ఫలితాలు వస్తున్నాయని, ఇప్పటికే మూడు కేసులకు సంబంధించిన దర్యాప్తు ప్రక్రియ ముగిసిందని అధికారులు వెల్లడించారు. మిగిలిన కేసులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, వాటి దర్యాప్తు సారాంశాన్ని నివేదిక రూపంలో వెంటనే అందజేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) బస్వా రెడ్డి, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, సి.టి.సి ఏసీపీ రాజశేఖర్, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, పలువురు దర్యాప్తు అధికారులు మరియు సంబంధిత కక్షిదారులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

**నిజామాబాద్ జిల్లా 07మార్చి(డీడీ9 వార్త) :**

విద్యార్థులు బాల్యదశ నుంచే చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ఆత్మ విశ్వాసంతో సమాజంలో ఎదగగలరని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆకాంక్షించారు. సీపీ ఆదేశాల మేరకు నిజామాబాద్ భరోసా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఆర్సపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రం ప్రతినిధులు విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు ఉన్న పోక్సో చట్టం, అందులోని కఠిన శిక్షల గురించి వివరించారు. ఆపద సమయాల్లో భరోసా కేంద్రం సేవలను ఎలా పొందాలో తెలియజేస్తూనే, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. నిత్యజీవితంలో ఎదురయ్యే భయాన్ని అధిగమించేందుకు ఫిల్లిస్ క్రిస్టల్ పద్ధతిలోని గోల్డెన్ సర్కిల్, స్టార్ టెక్నిక్ వంటి అంశాలను విద్యార్థులకు నేర్పించారు. నేటి కాలంలో సోషల్ మీడియా వినియోగం పెరిగిన నేపథ్యంలో, దాని వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు పొంచి ఉన్న ముప్పుల గురించి హెచ్చరించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ, టీ సేఫ్ యాప్ ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. చిన్న పిల్లలకు సేఫ్ టచ్ అన్‌సేఫ్




టచ్ గురించి వివరిస్తూ, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. విద్య యొక్క ఆవశ్యకతను తెలియజేసేందుకు పలు కేస్ స్టడీలను ఉదాహరణలుగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

**బోధన్, నిజామాబాద్ 07మార్చి(డీడీ9 వార్త) :**

సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం ఫుడ్ ఫెస్టివల్ ను నిర్వహించారు. సంప్రదాయ వంటకాలపై అవగాహన కల్పించడం, విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడం మరియు సమతుల్య ఆహారం ప్రాధాన్యతను తెలియజేయడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ ఆహార మహోత్సవంలో భాగంగా విద్యార్థులు రకరకాల ఆరోగ్యకరమైన సంప్రదాయ వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. స్టాళ్లలో ప్రదర్శించిన వంటకాల తయారీ విధానం, వాటిలోని పోషక విలువల గురించి విద్యార్థులు వివరించిన తీరు ఆకట్టుకుంది. పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థుల కృషిని అభినందించారు. ఈ వేడుక విద్యార్థుల మధ్య ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, మన సంస్కృతిలో భాగమైన ఆహారపు అలవాట్ల పట్ల అవగాహన పెంచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పురానే విజయ్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



**నిజామాబాద్ జిల్లా 07మార్చి(డీడీ9 వార్త) :**

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని భీమ్గల్ మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, ప్రజాపాలనప్రగతి ప్రణాళిక మరియు 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కేక్ కట్ చేసి మహిళా ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకుని ప్రగతి పథంలో సాగాలని కోరారు. అనంతరం వైస్ చైర్‌పర్సన్, మహిళా కౌన్సిలర్లు మరియు మహిళా పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధిలో మహిళా ఉద్యోగుల సేవలు అమూల్యమని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సంటి లత నర్సయ్య, కౌన్సిలర్లు కుశలత అనంత రావు, సందీప్, సంగ్యా నాయక్, మెప్మా మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా భీమ్గల్ పట్టణంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా ఒకటి మరియు రెండో వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ గోపు గంగాధర్ స్థానిక కౌన్సిలర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పిచ్చిమొక్కల తొలగింపు, డ్రైనేజీల శుభ్రతపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన పాత సామాగ్రిని, ఉపయోగంలో లేని వస్తువులను తొలగించి పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దారు. కార్యాలయ ప్రాంగణం ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండాలని, ప్రజలకు ఆదర్శంగా నిలవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.



# కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ 10వ వర్ధంతి సభలను జయప్రదం చేయండి

**బోధన్, నిజామాబాద్ 07మార్చి(డీడీ9 వార్త) :**

విప్లవ యోధుడు కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ 10వ వర్ధంతి సభలను జయప్రదం చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ పిలుపునిచ్చారు. శనివారం బోధన్ పట్టణంలోని పాన్ గల్లిలో కామ్రేడ్ రవన్న 10వ వర్ధంతి సభల గోడ పత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... కామ్రేడ్ రవన్న జీవితం విప్లవోద్యమానికి అంకితమని, సైద్ధాంతిక రాజకీయ కృషితోపాటు ఆచరణలో అనుభవాలను జోడించి ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడని కొనియాడారు. సుమారు 50 ఏళ్ల సుదీర్ఘ అజ్ఞాత జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న రవన్న, అతివాదానికి, మితవాదానికి వ్యతిరేకంగా ప్రజా పంథా మార్గమే సరైనదని నిరూపించారని ఆయన పేర్కొన్నారు. ఆ స్ఫూర్తితోనే మనమంతా ముందుకు సాగాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈ నెల 9న అన్ని ప్రాంతాల్లో కామ్రేడ్ రవన్న 10వ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని, 10వ తేదీన హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న వర్ధంతి సభకు పార్టీ ముఖ్య శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పడాల శంకర్, ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకులు జి.సీతారాం, భవన నిర్మాణ కార్మికులు పి.ప్రవీణ్, భూమయ్య, మోహన్, సాయిలు, శంకర్, శ్రీను, అప్ప, ఓడ్డీ, లక్ష్మణ్, గంగరాం తదితరులు పాల్గొన్నారు.



# సాలూర పాఠశాలలో ఘనంగా స్కూల్ ట్విన్నింగ్ కార్యక్రమం

**బోధన్, నిజామాబాద్ 07మార్చి(డీడీ9 వార్త) :**

విద్యార్థుల మధ్య పరస్పర అవగాహన, విద్యాబోధనలో నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన స్కూల్ ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా రుద్రూర్ గాంధీ ఎంపీపీఎస్ విద్యార్థులు సాలూరలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంత పాఠశాలల మధ్య భాగస్వామ్యాన్ని పెంచడం, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య యోగ, క్రీడలు, బోధనాంశాలను పంచుకోవడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా అతిథి విద్యార్థులకు ఐఎఫ్పీ ప్యానెల్ ద్వారా ప్రత్యేక ప్రేరణాత్మక సెషన్ నిర్వహించారు. అనంతరం సందర్శకులు పాఠశాలలోని కిచెన్ గార్డెన్, తరగతి గదులు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించి పాఠశాల వాతావరణంపై ఆసక్తి కనబరిచారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ సాలూర విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, యోగాసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రుద్రూర్ గాంధీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాణి రత్నకుమారి, ఉపాధ్యాయులు తాటి సునంద, రాధా, గంగా శంకర్, అతార్, శివా కుమార్, రోజా, సాలూర జడ్పీహెచ్ఎస్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పురానే విజయ్ కుమార్, ఉపాధ్యాయులు సుధారాణి, అరుణ్ కుమార్, గంధం సాయిలు, పి.డి సంగీత్రావు, లక్ష్మి, స్వామి, రాజ్ కుమార్, అబ్బయ్య, విజయలక్ష్మి, విఠల్ కాంబ్లే, అంజన, మేడి రవి, అక్షయ్ కుమార్ జాదవ్, వనజ, సాయిలుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



# నిజామాబాద్‌లో ఘనంగా డీడీ9 వార్త దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ




**నిజామాబాద్ జిల్లా 07మార్చి(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో డీడీ9 వార్త దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గనులు మరియు భూగర్భ శాఖ సహాయ సంచాలకులు జి.సంజయ్ కుమార్, అదే శాఖకు చెందిన సూపరింటెండెంట్ గోవర్ధన్, భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ మరియు డిజిడబ్ల్యుఓ పి.శ్రీనివాస బాబులతో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ ఈ ఆవిష్కరణలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సమాజహితం కోసం పనిచేసే పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలని ఆకాంక్షించారు. నిజామాబాద్ జిల్లాలో డీడీ9




వార్త దినపత్రిక తనదైన శైలిలో వార్తలను అందిస్తూ ప్రజల ఆదరణ పొందాలని వారు ఈ సందర్భంగా పత్రికా యాజమాన్యానికి, ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతాయుతమైన జర్నలిజంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమం లో డీడీ 9 వార్త నిజామాబాద్ జిల్లా ఇంచార్జి డాఖ దుర్గా ప్రసాద్ శివ కుమార్ గర్మా తదితరులు పాల్గొన్నారు






# సాలూర క్యాంప్ లో పర్యటించిన ఎంపీడీఓ శ్రీనివాస్

**బోధన్, నిజామాబాద్ 07మార్చి(డీడీ9 వార్త) :**

సాలూర క్యాంప్‌లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై ఎంపీడీవో శ్రీనివాస్ నేతృత్వంలోని అధికారుల బృందం క్షేత్రస్థాయి పర్యటన చేపట్టింది. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలోని పలు ప్రభుత్వ విభాగాలను తనిఖీ చేశారు. ముందుగా సాలూర క్యాంప్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, పాలనాపరమైన అంశాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎంపీయూపీఎస్ పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యాప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. పచ్చదనం పెంపులో భాగంగా నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించిన అధికారులు, మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన బృందం లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని ఎంపీడీవో స్పష్టం చేశారు. పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి కార్యదర్శి దమ్మాయి రవి తదితరులు పాల్గొన్నారు.



# నాగ భూషణం పాఠశాల లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**ఆదిలాబాద్,బోథ్.మార్చి.07(డి డి 9)**

బోథ్ మండల్ నాగ భూషణం పాఠశాల లో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భం గా మహిళ కానిస్టేబుల్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# డెలావేర్ గవర్నర్ హైదరాబాద్ పర్యటన

- **ఈసీఐఎల్ సందర్శించిన డెలావేర్ ప్రతినిధులు**
- **డా. ఏఎస్ రావు విగ్రహానికి పుష్పాంజలి**

**కాప్రా,మార్చి 7(డిడి9 వార్త):**

అమెరికాలోని డెలావేర్ రాష్ట్ర గవర్నర్ మ్యాట్ మేయర్ అధికారిక పర్యటనలో భాగంగా హైదరాబాద్ నగరానికి వచ్చారు. ఆయనతో పాటు ఆ రాష్ట్ర కార్యదర్శి చారుణి పాటిబండ సాంచెజ్, గవర్నర్ సతీమణి డా. లారీన్ మేయర్, భారత-అమెరికా దేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులతో కూడిన ప్రతినిధి బృందం కూడా నగరానికి చేరుకుంది.

శనివారం నగరంలోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ప్రధాన ద్వారం వద్ద సంస్థ స్థాపకుడు డా. ఏ.ఎస్. రావు విగ్రహానికి చారుణి పాటిబండ సాంచెజ్ పుష్పమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ మ్యాట్ మేయర్, ఇతర ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

డా. ఏ.ఎస్. రావు దేశానికి శాస్త్ర సాంకేతిక రంగంలో చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతరం ప్రతినిధి బృందం సంస్థ కార్యకలాపాలు, పరిశోధనల గురించి వివరాలు తెలుసుకుంది.

హైదరాబాద్ నగరం ఐటీ, ఔషధ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, డెలావేర్ రాష్ట్రంతో వ్యాపార, పరిశోధన, పెట్టుబడి అవకాశాలను మరింత విస్తరించేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని ప్రతినిధి బృందం తెలిపింది.

ఈ సందర్భంగా డా. ఏ.ఎస్. రావు మనవరాలు చారుణి పాటిబండ సాంచెజ్ మాట్లాడుతూ తాతగారి ఆశీర్వాదం కోసం ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి కృషి చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.

అమెరికా-భారత దేశాల మధ్య విద్య, పరిశోధన, పెట్టుబడుల రంగాల్లో సహకారం పెంపొందించడంపై కూడా ఈ పర్యటనలో చర్చలు జరగనున్నట్లు తెలిసింది.

ఈ కార్యక్రమంలో ఈసీఐఎల్ సీఎండీ అనీష్ కుమార్ శర్మ,డా. ఏ.ఎస్.రావు కుమార్తె సుగుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.





## గ్రామ సమస్యలను కాంగ్రెస్ పార్టీ ఉన్నతాధికారులతో చర్చించిన సోన్ పెల్లి,పొన్న గ్రామాల కాంగ్రెస్ నాయకులు.

**పొన్న 07 మార్చి(డిడి9 వార్త న్యూస్ ):**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సోయం. బాపూరావు నివాసంలో పొన్న మరియు సోంపల్లి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తమ తమ గ్రామాల సమస్యలను వివరించడం జరిగినది. అలాగే పొన్నా గ్రామంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కొన్ని బోర్లు మంజూరు గురించి మరియు తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్ల లో భాగంగా రెండో విడత ఇండ్ల లిస్టును ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొన్న గ్రామానికి 50 ఇందిరమ్మ ఇండ్లను, సోంపల్లి గ్రామానికి 50 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించడానికి కృషి చేస్తానని, మరియు తాగునీటి కోసం బోర్లను వేయించడానికి కూడా అధికారులతో మాట్లాడి మంజూరు చేయించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంలో సోంపల్లి గ్రామ సర్పంచ్ లక్ష్మీకాంత్, మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బగునూరే మాధవ్ పటేల్, చౌహాన్. కిషన్ పటేల్, ఖదమ్. శివాజీ పటేల్ ఇచ్చోడ, మరియు ఇరు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## శివాజీ మహారాజ్ కమిటీ ఆధ్వర్యంలో జాబ్ మేళా విజయవంతం



- **యువత భవిష్యత్తుకు దారి చూపిన దుండిగల్ జాబ్ మేళా**
- **ఉద్యోగం కోసం వచ్చిన వారికి అక్కడికక్కడే ఆఫర్ లెటర్లు**

**కుత్బుల్లాపూర్ మార్చి 7 (డిడి9 వార్త):**

దుండిగల్ గ్రామంలో శ్రీ శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ కమిటీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా విజయవంతంగా నిర్వహించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో సుమారు 10 ప్రముఖ సంస్థలు పాల్గొన్నాయి. ముఖ్యంగా అపోలో, జీఎంఆర్, జస్ట్‌డైల్ వంటి ప్రముఖ కంపెనీలు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి అర్హత ఉన్న వారిని ఎంపిక చేశాయి. ఎంపికైన అభ్యర్థులకు కార్యక్రమం జరుగుతున్న వేళనే ఆఫర్ లెటర్లు అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు తురాయి భాను గౌడ్ మాట్లాడుతూ యువత ఉద్యోగాలు సాధించి జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి జాబ్ మేళాలను నిర్వహించి యువతకు మరింత అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తలారి రాజ్ కుమార్,శ్రీధర్ గౌడ్, కార్వి నాగరాజు,ఆకుల విజయ్, ఎస్.సాయి కిరణ్,ఏలూరి విష్ణు, ప్రమోద్,శివ,యశ్వంత్,శ్రీకాంత్, యాదగిరి ,అనిల్,శ్రీను,మధు, ప్రతాప్,క్రాంతి,కిరణ్,మధు, రామ్,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.





## గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలి : సి ఐ టి యు

**వలిగొండ మార్చి 7(డిడి9 వార్త):**

మార్చి 22026తేదీ న రాష్ట్ర ప్రభుత్వంపంచాయితీ కార్మికుల వేతనాలు 15ఫైనాన్స్, రాష్ట్ర ఫైనాన్స్, జనరల్ ఫొండ్ నుండీ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సర్కులర్ ని వెంటనే వెనుకకు తీసుకోవాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పైలగణపతి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శనివారం రోజున గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలని ఎంపీడీవోకు వినతిపత్రం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లో కి వచ్చిన కార్మికులు కు ఇచ్చే 9500రూపాయలవేతనం నెలలు తరబడి చెలించక పోవడం తో సీఐటీయూ గా ఆందోళన పోరాటాలు చేయడం వల్ల స్వయనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి పంచాయతీ కార్మికుల వేతనాలు ఇవ్వడానికి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చేపడతామని, పంచాయతి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల గ్రీన్ ఛానల్ ద్వారా 2025 జనవరి నుండి నేరుగా ప్రభుత్వ మే కార్మికుల అకౌంట్లో వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆ సందర్భంలో కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు 160 కోట్లు కూడా రిలీజ్ చేయడం జరిగింది ఆ పద్ధతిలోని వేతనాలు చెల్లించడం జరిగింది. తరువాత బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లిస్తామని కార్మికుల యొక్క పాన్ కార్డులు ఆధార్ కార్డులు బ్యాంకు వివరాలు సేకరించారు. కానీ బ్యాంకు ద్వారా చెల్లించలేదు నేరుగా టి ఎస్ బి పాస్ ద్వారా నేరుగా కార్మికుల వ్యక్తిగత ఖాతాలో జమ చేస్తూ 150 కోట్లు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు కొండే నరసింహ కుర్తి రాములు లింగస్వామి సురేష్ పావురాల శీను సాలయ్య యాదయ్య యాదమ్మ సంతోషాలు రాములమ్మ, స్వామి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోనేరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పెన్నులు ప్యాడ్లు పంపిణీ



**నిజామాబాద్ పోతంగల్ మార్చ్ 07(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని సుంకిని, కారేగాం, పోతంగల్ ఉర్దూ మీడియం స్కూల్, హంగర్గ ఫారం ఉర్దూ మీడియం స్కూల్ లలో10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు కోనేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో కోనేరు శశాంక్ గారు పరీక్ష ప్యాడ్స్, పెన్స్ పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి పంపిణీ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ సీనియర్ నాయకులు ప్రకాష్ పటేల్ గారు, రుద్రూర్ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ గారు, పోతంగల్ మండల మైనార్టీ మోర్చా అధ్యక్షులు నయీమొద్దీన్ గారు, మండల సీనియర్ నాయకులు K.రాములు గారు, గోపురి రమేష్ గారు, శంకర్ పటేల్ గారు, మేత్రీ లక్ష్మణ్ గారు, శ్రీధర్ గారు, సాయిలు గారు, రమేష్ గారు, ప్రహ్లాద్ గారు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## టీచరుగా సేవలందించిన మహిళలను సత్కరించిన చీరాల ఎమ్మెల్యే

**వేటపాలెం మార్చి 7 (డిడి9 వార్త):**

వేటపాలెం మండలం ఏపీటీఎఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండల స్థాయి మహిళా సదస్సు శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కళ్యాణ మండపం నందు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్య మరియు యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీరాల శాసనసభ్యులు మంత్రులు మాలకొండయ్య మాట్లాడుతూ టీచర్ గా సేవలందించిన మహిళలను సత్కరించడం ఆనందంగా ఉందని, అక్కగా, చెల్లిగా, తల్లిగా మహిళలు ప్రతి ఒక్కరి జీవితాల్లో చెరగిపోని ముద్ర వేస్తారు. అలాంటి మహిళలను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. మహిళా హక్కుల పరిరక్షణకు ప్రతి పౌరుడూ పాటు పడాలి. ప్రతి మహిళనూ గౌరవించుకోవాలి. మహిళా శక్తిని గౌవించుకోవడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 'మహాశక్తి' కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేయడం మహిళల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి మహిళకూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.




## ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుక




**కామారెడ్డి జిల్లా మార్చి 07 (డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని వాసవి పాఠశాలలో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లులు ప్రధానంగా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందించారు. పలువురు విద్యార్థులు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా వాసవి పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ శ్వేత మాట్లాడుతూ మహిళ కేవలం ఒక వ్యక్తి కాదని ఆమె ఒక తల్లి, ఒక గురువు, ఒక సోదరి, ఒక నాయకురాలుగా తన బాధ్యతలు నిర్వహిస్తున్నారని చెప్పారు. స్త్రీ లేకపోతే ఈ సృష్టి లేదన్నారు. మహిళలు నేడు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారని వివరించారు. మహిళలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఒక బాలిక చదువుకుంటే కుటుంబం ఎదుగుతుందని పాఠశాలలో చదువుతున్న ప్రతి బాలిక తనలోని ప్రతిభను వెలికితీసి, భవిష్యత్తులో గొప్ప స్థానాన్ని సంపాదించాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాలకుర్తి విజయ్ కుమార్ డైరెక్టర్లు బెజుగం కల్పన నాగులగామ వందన కందారే అనిత మోటమర్రి సంధ్యారాణి పాలకుర్తి శివాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## వివేకానందపాఠశాలలోముందస్తు మహిళా దినోత్సవం.




**బజార్ హత్నూర్, మార్చి 7 (డిడి9వార్త ):-**

ఆదిలాబాద్ జిల్లా సొనాలమండలకేంద్రం వివేకానంద పాఠశాలలో శనివారం రోజు ముందస్తుగా మహిళా దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా పోషక మహిళలకు ఆరు రకాల ఆటలపోటీలు పెట్టి ఆడించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలైన వారికి ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులను అందించి ఘనంగా సన్మానంలు చేశారు.ఈ కార్యక్రమంలో మహిళా పోషకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య, కరెస్పాండెంట్ ఓరుగంటి ఇస్తారి ,విద్యార్థులు,ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



# ‘ఇది భగత్ గీత.. దమ్మున్నోడు దాటొచ్చు’.. ‘ఉస్తాద్’ ఊచకోత!

పవన్ కల్యాణ్ - హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్’ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించేందుకు సిద్ధమవుతోంది. మార్చి 19న ఉగాది కానుకగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, చిత్ర యూనిట్ ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. తాజాగా చిత్ర బృందం ట్రైలర్ టీజ్ అంటూ ఓ చిన్న వీడియోను రిలీజ్ చేసింది. ‘ఇందాక విన్నది భగవద్గీత.. ఇది భగత్ గీత.. దమ్మున్నోడు దాటొచ్చు’ అంటూ పవన్ చెప్పిన డైలాగ్ ఫ్యాన్స్‌ను ఉర్రూతలు ఊగించేలా ఉన్నాయి. చిత్ర పూర్తి ట్రైలర్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు.

ఈ సినిమా ఉగాది సందర్భంగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. నిజానికి మార్చి 26న విడుదల కావాల్సి ఉన్న ఈ సినిమా, యష్ ‘టాక్సిక్’ వాయిదా పడటంతో వారం ముందే థియేటర్లలోకి రాబోతుంది. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్న ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు. తమన్ కూడా బ్యాక్ గ్రౌండ్ స్కోర్ (BGM) పనుల్లో పాలుపంచుకుంటున్నారు. ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు.



# టికెట్ ధర పెంపు లేకుండానే ‘ధురంధర్2’ పెయిడ్ ప్రీమియర్స్..

‘ఈసారి పాకిస్థాన్ భవిష్యత్‌ను నిర్ణయించేది భారత్’ అంటున్నారు రణ్‌వీర్ సింగ్. ఆయన కథానాయకుడిగా ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ ‘ధురంధర్2: ది రివెంజ్’. సారా అర్జున్ కథానాయిక. మాధవన్, సంజయ్‌దత్, అర్జున్ రాంపాల్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచింది. ‘ధురంధర్: పార్ట్1’తో పోలిస్తే రెండో భాగంలో యాక్షన్‌తో పాటు ఎమోషనల్ డ్రామాకు పెద్ద పీట వేసినట్లు తెలుస్తోంది.

మరోవైపు ‘ధురంధర్’కు వచ్చిన క్రేజ్‌ను ఒడిసిపట్టుకునేందుకు చిత్ర బృందం సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా ఒకరోజు ముందుగానే పెయిడ్ ప్రీమియర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. అంటే మార్చి 18వ తేదీ సాయంత్రం ఫస్ట్ షో నుంచే ‘ధురంధర్2: ది రివెంజ్’ మూవీని ప్రదర్శించబోతోంది. ఇప్పటికే బుక్‌మై షో, డిస్ట్రిక్ట్ యాప్‌ల ద్వారా టికెట్ బుకింగ్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. హిందీతో పాటు, ఇతర దక్షిణాది భాషల్లో ఈ సినిమాను తీసుకొస్తున్నా.. పెయిడ్ ప్రీమియర్స్ వరకు హిందీలోనే బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. హైదరాబాద్‌లోని వివిధ మల్టీప్లెక్స్‌లలో ఇప్పటికే టికెట్స్ అందుబాటులోకి వచ్చాయి. సాధారణంగా పెయిడ్ ప్రీమియర్స్‌కు టికెట్ ధర స్పెషల్‌గా ఉంటుంది. కానీ, ‘ధురంధర్2’ టికెట్ ధరల్లో ఎలాంటి పెంపు లేకపోవడం గమనార్హం. దీనిని బట్టి చూస్తే, ఎక్కువ మంది ప్రేక్షకులు థియేటర్‌కు రావడమే లక్ష్యంగా చిత్ర బృందం పావులు కదుపుతున్నట్లు అర్థమవుతోంది.

**భారీ రన్‌టైమ్..**

ప్రస్తుతం బుకింగ్స్ మొదలైన నేపథ్యంలో సినిమా రన్‌టైమ్‌పైనా స్పష్టత వచ్చింది. ఇప్పటి వరకూ సోషల్‌మీడియా వేదికగా జరిగిన చర్చలకు ఫుల్‌స్టాప్ పెడుతూ ‘ధురంధర్ 2: ది రివెంజ్’ నిడివి 3 గంటల 55 నిమిషాలతో రానున్నట్లు బుక్‌మై షోలో చూపిస్తోంది. మొదటి భాగం 3 గంటలా 34 నిమిషాలతో పోలిస్తే చాలా ఎక్కువే. ఇంటర్వెల్‌తో కలిపి దాదాపు నాలుగు గంటలపైనే ప్రేక్షకుడు థియేటర్‌లో ఉండాలి. మరి సినిమాలో అంత బలమైన కంటెంట్ ఉందా? అంటే ఆ విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గేదిలేదని ఆదిత్య ధర్ అంటున్నారట. దీన్ని బట్టి ట్రైలర్‌లో చూపించింది చాలా తక్కువే అనిపిస్తోంది.

**ఆ ప్రశ్నలన్నింటికీ సమాధానం..**

గతేడాది కేవలం హిందీలోనే విడుదలైన ‘ధురంధర్’ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా హిందీతో పాటు, తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇక ‘ధురంధర్2’లో అనేక ప్రశ్నలకు సమాధానం లభించనుంది. జస్కిరాత్ సింగ్ రాంగి (రణ్‌వీర్) భారత్‌లో ఉండగా ఎందుకు జైలుకు వెళ్లాల్సి వచ్చింది? అతడు చేసిన నేరం ఏంటి? అతడి పేరును హమ్జాగా మార్చిన అజయ్ సన్యాల్ (మాధవన్) ఎందుకు గూఢచారిగా ఎంపిక చేశాడు? రెహమాన్ డెకాయిత్ (అక్షయ్ ఖన్నా) చనిపోయిన తర్వాత ల్యారీని హమ్జా ఎలా తన గుప్పిట్లోకి తీసుకున్నాడు? ఇండియాపై కుట్రలు చేస్తున్న మేజర్ ఇక్బాల్ (అర్జున్ రాంపాల్)ను ఎలా మట్టుబెట్టాడు? ఈ క్రమంలో ఎస్పీ అస్లామ్ చౌదరి (సంజయ్ దత్) నుంచి ఎలాంటి ప్రతిఘటన ఎదురైంది? ఇంతకీ బడేసాబ్ (...) ఎవరు? అన్న ప్రశ్నలకు ‘ధురంధర్2’ సమాధానం చెప్పనుంది.



# అప్పుడు దీపిక 8 గంటలు అడగలేదు..

ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారిన వర్కింగ్ అవర్స్ అంశంపై తాజాగా నటి అనన్య పాండే మాట్లాడారు. కరీనా కపూర్, కల్యాణి ప్రియదర్శన్‌లతో కలిసి ఆమె ‘ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా’ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో వర్కింగ్ అవర్స్ గురించి ప్రస్తావించారు.

‘‘దీపికా పదుకొణె  అంకితభావం ఉన్న నటి. నేను ఆమెతో కలిసి పని చేశాను. అప్పుడు దీపిక ఎలాంటి డిమాండ్లు చేయలేదు. వర్క్‌షాప్‌లకు కూడా వచ్చేవారు. షూటింగ్ విషయంలో ఎప్పుడూ ఫిర్యాదులు చేయలేదు. ఇప్పుడు ఆమె ఒక బిడ్డకు తల్లి. ఆ పాపకు కనీసం రెండేళ్లు అయినా పూర్తిగా దీపిక అవసరం ఉంటుంది. అందుకే ఇప్పుడు ఇలాంటి డిమాండ్ చేశారు. ఇందులో తప్పేం లేదు. ఆమె డిమాండ్‌కు పూర్తి మద్దతు ఇస్తాను’’ అని అనన్య అన్నారు.

కరీనా తల్లి అయిన తర్వాత ఇండస్ట్రీలో పాత ఆలోచనా ధోరణిని మార్చేశారని అనన్య అభిప్రాయపడ్డారు. ఆమె తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఇప్పుడు వస్తోన్న హీరోయిన్లకు ఎంతో ధైర్యాన్ని ఇస్తున్నాయన్నారు. పరిశ్రమలో హీరోయిన్స్ తమ వ్యక్తిగత జీవితానికి, వృత్తికి మధ్య సమతుల్యత పాటించేలా నిర్మాతలతో చర్చలు జరపడంలో తప్పులేదని అనన్య పేర్కొన్నారు. పని వేళల విషయంలో ఎటువంటి కఠినమైన నిబంధనలు ఉండకూడదన్నారు. దీపికా లాంటి స్టార్ హీరోయిన్ ఇలాంటి మార్పును డిమాండ్ చేయడం వల్ల భవిష్యత్తులో అందరికీ మేలు జరుగుతుందని పేర్కొన్నారు.



# ఆస్కార్ వేడుకకు ప్రియాంక చోప్రా



‘ది బ్లఫ్’ సినిమాతో ఓటీటీలో సందడి చేస్తూ యాక్షన్ ప్రియులందర్నీ ఆకట్టుకుంటోంది హీరోయిన్ ప్రియాంక చోప్రా. ప్రస్తుతం దర్శకుడు రాజమౌళి.. మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న ‘వారణాసి’ సినిమాతో బిజీగా ఉంది. తాజాగా ఈ అందాల తార 98వ అకాడమీ పురస్కారాల వేడుకలో మెరవనున్నట్లు అభిమానులతో పంచుకుంది. ఈ నెల 16న జరగనున్న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె అధికారిక ప్రెజెంటర్‌లలో ఒకరిగా వ్యవహరించనున్నట్లు ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది.

ఈ కార్యక్రమంలో హాలీవుడ్ ప్రముఖులు రాబర్ట్ డౌనీ జూనియర్, విల్ ఆర్నెట్ తదితరులతో కలిసి ప్రియాంక ప్రెజెంటర్‌గా పాల్గొననుంది. ఇటీవలే కేపాప్ లీసాతో కలిసి గోల్డెన్ గ్లోబ్ అవార్డుని ప్రదానం చేసింది ప్రియాంక. 2016లోనూ ప్రియాంక ఆస్కార్ ప్రెజెంటర్‌గా వ్యవహరించింది. 95వ ఆస్కార్ అవార్డులలో దీపికా పదుకొణె ‘ఆర్ ఆర్ ఆర్’ సినిమాలోని ‘నాటు నాటు’ గీతాన్ని ప్రపంచ వేదికపై పరిచయం చేసింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ప్రియాంక అకాడమీ వేదికపై కనిపించనుంది. ఆస్కార్ బరిలో ‘సిన్నర్స్’ చిత్రం 16 నామినేషన్‌లతో అగ్రస్థానంలో ఉంది.

# వరుసగా ఆస్తులు అమ్మేస్తున్న ప్రీతీ జింటా.. ఎందుకంటే ?

బాలీవుడ్ సీనియర్ హీరోయిన్, పంజాబ్ కింగ్స్ ఓనర్ ప్రీతీ జింటా ముంబై రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నారు. బాంద్రాలోని అత్యంత సంపన్న ప్రాంతమైన ‘పాలి హిల్’లో తనకున్న లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను ఆమె తాజాగా రూ. 18.50 కోట్లకు విక్రయించారు. విశేషం ఏంటంటే, గత నాలుగు నెలల్లోనే ఆమె ఇలా భారీ ఆస్తిని అమ్మేయడం ఇది రెండోసారి.

గతేడాది నవంబర్‌లో ఇదే ‘రుస్తోమ్‌జీ పరిశ్రమ్’ బిల్డింగ్‌లోని 11వ అంతస్తులో ఉన్న ఒక ఫ్లాట్‌ను ప్రీతి రూ. 14 కోట్లకు పైగా ధరకు విక్రయించారు. ఇప్పుడు తాజాగా అదే అంతస్తులో ఉన్న మరో 1,770 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్‌ను మార్చి 2, 2026న అమ్మేశారు. ఈ డీల్ కోసం కొనుగోలుదారులు దాదాపు రూ. 1.11 కోట్ల స్టాంప్ డ్యూటీ కూడా చెల్లించినట్లు సమాచారం. మరి ప్రీతీ జింటా ఇలా వరుసగా ఆస్తులు విక్రయించడం వెనుక ఒక పెద్ద ప్లాన్ ఉన్నట్లు తెలుస్తోంది. బాంద్రాలోనే దాదాపు రూ. 100 కోట్ల విలువైన ఒక భారీ ప్రాపర్టీని కొనుగోలు చేసేందుకు ఆమె సిద్ధమవుతున్నారని, అందుకే ఈ చిన్న చిన్న ఆస్తులను అమ్మేసి ఆ సొమ్మును అక్కడ ఇన్వెస్ట్ చేయబోతున్నారని టాక్ వినిపిస్తోంది.

కేవలం ప్రీతి మాత్రమే కాదు, ఇటీవల కాలంలో అమితాబ్ బచ్చన్, అక్షయ్ కుమార్ వంటి స్టార్ హీరోలు కూడా భారీ రియల్ ఎస్టేట్ డీల్స్ చేస్తున్నారు. 2025లో అక్షయ్ కుమార్ తన ఆస్తుల ద్వారా రూ. 100 కోట్లకు పైగా ఆర్జించగా, బిగ్ బి కూడా అదే రేంజ్‌లో డీల్స్ కుదుర్చుకున్నారు. తాజాగా జీతేంద్ర, ఏక్తా కపూర్ కూడా తమ అపార్ట్‌మెంట్‌ను రూ. 12.25 కోట్లకు విక్రయించి వార్తల్లో నిలిచారు.





# ‘కథను మానభంగం చేశారు’..

ప్రముఖ రైటర్ సాయి మాధవ్ బుర్ర సామాజిక మాధ్యమాల వేదికగా ఓ సినిమా కథపై పరోక్షంగా సంచలన కామెంట్స్ చేశారు. ఈ సందర్భంగా ఆయన తన ఫేస్‌బుక్ ఖాతాలో.. ‘నా కథతో మొదలై వేరే కథతో పూర్తవుతుంది.. ఒక్కమాట చెప్పకుండా ఇష్టమొచ్చినట్టు మార్చేసుకున్నారు.. కథని మానభంగం చేశారు.. నాది రివెంజ్ డ్రామా కాదు.. నా సోల్ వేరు.. అసలా కథే వేరు’ అని రాసుకొచ్చారు. దీనిపై నెట్టిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు రాసుకున్న కథను తెరపైకి అలాగే తీసుకురావాలంటే అదృష్టం ఉండాలని అంటే, మరికొందరు ఆ సినిమా రచయితే నిర్మాత కావాలని అంటున్నారు. మొత్తానికి ఆయన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అయితే అది ఎస్. సరస్వతి సినిమా గురించే అనే చర్చ జరుగుతోంది.

నటి వరలక్ష్మి శరత్ కుమార్ దర్శకురాలిగా మారి చేసిన సినిమా ‘సరస్వతి’. స్వతహాగా తమిళ నటి అయినా, ఈ మధ్యకాలంలో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఈ సినిమాని తెలుగులోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం గమనార్హం. రిలీజ్‌కి ఒక రోజు ముందు సెన్సార్ అభ్యంతరాలతో ‘ఎస్ సరస్వతి’గా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వరలక్ష్మి శరత్ కుమార్ మొదటి సారి దర్శకత్వం చేస్తూ ఉండటం, ప్రమోషన్ కంటెంట్ వర్కౌట్ కావడంతో సినిమా మీద ప్రేక్షకులలో అంచనాలు ఏర్పడ్డాయి.



# పెళ్లి పీటలెక్కబోతున్న బెల్లంకొండ శ్రీనివాస్ ?

మెగా మాస్ యాక్షన్ సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్, తన వ్యక్తిగత జీవితంలో ఒక ముఖ్యమైన అడుగు వేయబోతున్నారు. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, మార్చి 8న ఆయన నిశ్చితార్థం  జరగనుంది. గత కొన్నేళ్లుగా ఒక అమ్మాయితో ప్రేమలో ఉన్న శ్రీనివాస్, పెద్దల అంగీకారంతో ఇప్పుడు తన బంధాన్ని అధికారికం చేసుకోబోతున్నారు.

కాగా ఈ వేడుక కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలోనే చాలా ప్రైవేట్‌గా జరగనుందని తెలుస్తోంది. టాలీవుడ్‌కు చెందిన కొద్దిమంది సన్నిహిత మిత్రులు మాత్రమే ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది. వధువుకు సంబంధించిన వివరాలను ప్రస్తుతానికి గోప్యంగా ఉంచినప్పటికీ, ఇది ప్రేమ వివాహం అని సన్నిహిత వర్గాలు ధృవీకరిస్తున్నాయి. శ్రీనివాస్ ఆ అమ్మాయి గత కొన్నాళ్లుగా ఒకరికొకరు సుపరిచితులని, ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే పెళ్లి నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ఈ వార్త బయటకు రావడంతో బెల్లంకొండ అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. త్వరలోనే ఒక అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

# హీరోయిన్ అడిగితే తప్పా?
## షూటింగ్ టైమింగ్స్‌పై యామీ గౌతమ్ ఫైర్!

సినిమా షూటింగ్‌లు అంటేనే రాత్రింబవళ్లు కష్టపడాలి.. ఇది ఒకప్పటి మాట. కానీ ఇప్పుడు ట్రెండ్ మారుతోంది. షూటింగ్ టైమింగ్స్, వర్కింగ్ అవర్స్ గురించి బాలీవుడ్ బ్యూటీ యామీ గౌతమ్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతున్నాయి. ముఖ్యంగా మహిళా నటుల విషయంలో ఇండస్ట్రీ చూపిస్తున్న వివక్షను ఆమె ఎండగట్టారు. అందరికీ ఉన్నట్టే మాకూ పర్సనల్ లైఫ్ ఉంటుంది.. షూటింగ్‌లో ఎంత సేపు పని చేయాలనేది ముందే మాట్లాడుకుంటారు. ఇది కొత్తగా వచ్చిన డిమాండ్ ఏమీ కాదు.చాలా మంది హీరోలు ఎప్పటి నుంచో రోజుకు 8 గంటలు, వారానికి 5 రోజులు మాత్రమే పని చేస్తున్నారు. ఇది నటులు, నిర్మాతల మధ్య ఉండే అవగాహన. కానీ ఒక హీరోయిన్ అదే విషయాన్ని అడిగితే ఎందుకు అంత వివాదం చేస్తున్నారో అర్థం కావడం లేదు’ అని ఆమె సూటిగా ప్రశ్నించారు. అలాగే.. ‘కేవలం సినిమాల్లోనే కాదు, ఏ రంగంలో ఉన్నా మహిళలకు ‘తల్లి’ అయ్యే దశ చాలా కీలకం. ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి లేదా ఇంట్లో ఉండే గృహిణికి ఎంత బాధ్యతలు ఉంటాయో, మాకూ అంతే ఉంటాయి. మాకు కూడా ఫ్యామిలీ లైఫ్ ముఖ్యం. షూటింగ్ లొకేషన్లు, పర్మిషన్ల వల్ల పక్కాగా టైమ్ మెయింటైన్ చేయడం కష్టమని మాకు తెలుసు.. కానీ కనీస సమయ పాలన కోరుకోవడంలో తప్పేముంది?’ అని ఆమె నిలదీశారు. పెళ్లి తర్వాత హీరోయిన్ల కెరీర్ క్లోజ్ అయిపోతుందన్న భయం ఉన్న ఈ రోజుల్లో, యామీ గౌతమ్ లాంటి హీరోయిన్లు ఇలాంటి విషయాలపై ధైర్యంగా గళమెత్తడం విశేషం.

